షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 321 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 7 అక్టోబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 321 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 7 October 2024 PAGES : 8 PRICE : 5/-

## భారీ స్కెచ్‌తో ఢిల్లీకి చంద్రబాబు

- ఈ ఎన్నికల్లో అనూహ్యంగా చంద్రబాబు ఇమేజ్ పెరిగింది
- రాష్ట్రంలో ఒంటరిగానే టిడిపి 134 అసెంబ్లీ స్థానాలను సాధించింది
- కూటమిపరంగా 164 సీట్లతో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది.
- సరిగ్గా అటువంటి సమయంలోనే నేనున్నాను అంటూ చంద్రబాబు ఎన్డీఏ ఊపిరిలూదారు.
- వీలైనంత వరకు భారీగా కేంద్రం నుంచి నిధులు సమీకరణ చేయాలని భావిస్తున్నారు
- చంద్రబాబు ఢిల్లీ వెళ్తున్న ప్రతిసారి రాష్ట్రానికి ఏదో ఒక ప్రయోజనందక్కుతూ వస్తోంది.




విజయవాడ

కేంద్రంలో ఈసారి చంద్రబాబు పాత్ర పెరిగింది. గత ఐదేళ్లుగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నారు చంద్రబాబు. రాష్ట్రంలో అధికారానికి దూరం కాగా..కేంద్రంలో కూడా పరపతి తగ్గింది. అటు బిజెపి అగ్రనేతలు పట్టించుకోలేదు. వారిని కాదని ఇతర జాతీయ పార్టీలతో సంబంధాలు ఏర్పరచుకోలేదు చంద్రబాబు. అయితే ఈ ఎన్నికల్లో అనూహ్యంగా చంద్రబాబు ఇమేజ్ పెరిగింది. రాష్ట్రంలో ఒంటరిగానే టిడిపి 134 అసెంబ్లీ స్థానాలను సాధించింది. కూటమిపరంగా 164 సీట్లతో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. తెలుగుదేశం పార్టీ సొంతంగా 16 ఎంపీ సీట్లలో గెలిచింది. కూటమిపరంగా 21 సీట్లతో సత్తా చాటింది. అయితే గత రెండుసార్లు కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ సొంతంగానే అధికారంలోకి రాగలిగింది. కానీ ఈసారి మెజారిటీకి అల్లంతా దూరంలో - మిగతా3లో



## పర్యాటక శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారు

- మంత్రి కందుల దుర్గేష్
- వైసీపీ ప్రభుత్వంలో ఇష్టం వచ్చినట్లుగా వ్యవహారించడంతో పర్యాటక శాఖ తీవ్రంగా నష్టపోయింది
- విశాఖలోని యాత్రి నివాస్ నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేశారు
- ముందు కొత్త టెండర్ పిలిచి తర్వాత, టెండర్ ఏం లేకుండా పనులు చేయమన్నారు
- వైసీపీ చర్యలతో పర్యాటక రంగం ఆదాయాన్ని కోల్పోయే పరిస్థితి వచ్చింది





## భూమికి మరో ముప్పు

- దూసుకువస్తున్న మరో భారీ సౌర తుఫాను!
- ఇది కమ్యూనికేషన్ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం
- ఈ సౌర తుఫాను భారత్‌పై ఎక్కువగా ప్రమాదం ఉండదు
- ఇది ఉపగ్రహాలతో పాటు టెలికమ్యూనికేషన్స్‌కు అంతరాయం కలిగించే ఛాన్స్
- ఈ సౌర తుఫానును పరిశీలిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు

## పుంగనూరు బాలిక కుటుంబానికి న్యాయం చేస్తాం

- పుంగనూరులో హత్యకు గురైన చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించిన సీఎం చంద్రబాబు
- పుంగనూరులో ఏడేళ్ల బాలిక మిస్సింగ్ విషాదాంతం
- సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో శవమై తేలిన అస్పియా అంజుమ్
- బాలిక తండ్రికి ధైర్యం చెప్పిన చంద్రబాబు





## పాత ప్రసంగాలతో ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చలేరు

- ప్రధాని మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర విమర్శలు
- 'మేకిన్ ఇండియా' ఘోరంగా విఫలమైంది
- ప్రజలపై గృహ రుణాల భారం పెరిగింది
- ధరలు పెరిగాయి.. తయారీ రంగం కదగండ్ల పాలైంది
- గృహ రుణం జీడీపీలో 40 శాతం ఆల్‌టైమ్ రికార్డుకు పెరిగింది

## జనసేన విస్తరణ దిశగా పవన్

- తమిళంలో పార్టీని విస్తరించే ఆలోచనగా జనసేనాని
- ఎక్కడో ఆవు నెయ్యి కల్తీ దగ్గర మొదలైన రచ్చ పవన్ సనాతన ధర్మం కోసం తమిళంలో నిప్పులు చెరిగిన వరకు చేరుకుంది.
- ఇప్పుడు సినీ రంగంలో పవర్ స్టార్ స్థాయిలో ఉన్న తమ స్నేహితుడు పవన్‌ని ఉపయోగించుకుని తమిళనాట బాగా చొచ్చుకుపోయే వ్యూహం పన్నిందనేది పొలిటికల్ ఎనలిస్టుల అంచనా
- ఓ కొత్త వాదనతో తమిళ రాజకీయాల వైపు పవన్ అడుగులు వేస్తున్న దృశ్యం చాలా స్పష్టంగా కనబడుతుంది




విజయవాడ

రాజకీయాలు ఎంత విచిత్రంగా ఉంటాయంటే ఏదో సినిమాలో చెప్పినట్టు " లైట్ ఎక్కడో ఉంటుంది.. దాని స్విచ్చు ఇంకెక్కడో ఉంటుంది". నాయకుల స్పీచ్ గమనిస్తే యథాలాపంగా మాట్లాడిన మాటల వెనుక చాలా పెద్ద వ్యూహమే కనపడుతుంది. దానికి పవన్ కల్యాణ్ వారాహి డిక్లరేషన్ ప్రసంగం బెస్ట్ ఎగ్జాంపుల్. ఎక్కడో ఆవు నెయ్యి కల్తీ దగ్గర మొదలైన రచ్చ పవన్ సనాతన ధర్మం కోసం తమిళంలో నిప్పులు చెరిగిన వరకు - మిగతా3లో



- బీజేపీపై కేజ్రీవాల్ విమర్శలు
- వచ్చే ఏడాది సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్ర మోదీ రిటైర్ అవుతారు
- ఢిల్లీలో చేసిన ఏ ఒక్క పనైనా 22 రాష్ట్రాల్లో ఒక్క ఏడాదిలో చేయాలి
- ఢిల్లీ ప్రజల ప్రేమ, మద్దతు, నమ్మకమే నా నిజాయితీకి నిదర్శనం
- అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఉన్నాయి
- అక్కడ చేసిన మంచి పని ఒక్కటి చెప్పాలి

## తమిళనాడు గడ్డ సిద్ధులకు, సాధు పుంగవులకు నెలవు

- సనాతన ధర్మం అంశంలో పవన్ కల్యాణ్ ఐ ఉదయనిధి స్టాలిన్
- తరచుగా తమిళనాడు అంశాలపై ట్వీట్లు చేస్తున్న పవన్ కల్యాణ్
- తాజాగా తన తండ్రి ప్రస్తావనతో ట్వీట్

విజయవాడ

ఇటీవల సనాతన ధర్మం అంశంలో తమిళనాడు సీఎం ఉదయనిధి స్టాలిన్ తో మాటల యుద్ధం రాజుకున్న నేపథ్యంలో... ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమిళనాడుపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఇటీవల అన్నాడీఎంకే వ్యవస్థాపక దినోత్సవానికి ముందు స్తుగా శుభాకాంక్షలు తెలిపిన పవన్... తాజాగా ఓ ఆసక్తికర ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ లో తన తండ్రి ప్రస్తావన కూడా తీసుకువచ్చారు. "తమిళనాడు గడ్డ సిద్ధులకు, సాధు పుంగవులకు నెలవు. దివంగుతలైన మా నాన్న గారు స్వామి రామకృష్ణ పరమహంస, శారదా మాత, స్వామి వివేకానందలను ఎంతగానో ఆరాధించేవారు. ఆయన అప్పట్లోనే రాంచీ వెళ్లి క్రియా యోగ దీక్ష చేపట్టారు. అంతేకాదు, మాకందరికీ కూడా ఆ క్రియా యోగను పరిచయం చేశారు. 80వ దశకం చివర్లో, 90వ దశకం ఆరంభంలో మా నాన్న చెన్నైలోని శాంథోమ్ వెళ్లి మహావతార్ బాబాజీ ఆశ్రమాన్ని సందర్శించారు. ఆయన తరచుగా తిరువణ్ణామలై వెళ్లి యోగి రామ్ సూరత్ కుమార్ సేవలో పాల్గొనేవారు. సంస్కృతి, భక్తి సంప్రదాయాల పరంగా తమిళనాడు నిజంగా పుణ్యభూమి అని చెప్పాలి. తమిళనాడు ఎంతోమంది సిద్ధులు, సాధువుల ఆశీస్సులతో పునీతమైంది" అని పవన్ కల్యాణ్ వివరించారు.



# జనసేన విస్తరణ దిశగా పవన్

-మొదటిపేజీ తరువాయి

చేరుకుంది. సనాతన ధర్మ బోర్ట్ అనీ ధర్మ పరిరక్షణ అనీ పవన్ చాలా అంశాల మీదే మాట్లాడినా అసలు టార్గెట్ మాత్రం తమిళ రాజకీయ చిత్రమే అని అర్ధమయిపోతుంది అంటున్నారు విశ్లేషకులు. పవన్ కల్యాణ్ ఎంత తెలివైనవాడు అంటే అత్యంత సన్నిహితంగా మెలుగుతున్న వారు కూడా ఆయన వ్యూహం ఏంటి అనేది సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారు. ఆయన ఆవేశమంతా ఏదో జగన్ మీదనో.. తిరుమలలోని ఆ కల్తి నెయ్యి వివాదం మీదనో అని భావించారు. కానీ ఆయన తన పార్టీని విస్తృతపరిచే దిశగా అడుగులు వేస్తున్న సంగతి స్పష్టమైపోయింది. ఫక్తు ద్రవిడ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే తమిళనాడులో ఆల్టర్నేటివ్ పొలిటికల్ థాట్‌ను బిల్డ్ చేసే పనిలో పవన్ ఉన్నట్టు తెలిసిపోతుంది. తమిళనాడులో ఎంట్రీ ఇవ్వడం కోసం జాతీయ పార్టీలు చాలా ప్రయత్నించాయి. కానీ ఎంజీఆర్,కరుణానిధి కాలం నుంచి కూడా అది వర్కౌట్ కాలేదు. వారిద్దరనే కాదు తర్వాత కాలంలో జయలలిత, కరుణానిధి మధ్య ఎంతటి పొలిటికల్ వైరం నడిచినా బయట వ్యక్తులని వారు ఎంటర్ కానివ్వలేదు. మధ్యలో శరత్ కుమార్, విజయ కాంతుల లాంటి వాళ్ళు పార్టీలు పెట్టినా స్థానిక అంశాల మీదనే ఫోకస్ చేశారు. అంతే కానీ యాంటీ ద్రవిడియన్ థాట్ ఏ మాత్రం తమిళనాట ఎంకరేజ్ చేయలేదు. పోనీ వాళ్లందరి హవా ముగిసిపోయిన తర్వాత అంటే కరుణానిధి, జయలలిత మరణంతో తమిళ రాజకీయాల్లో ఒక ఖాళీ ఏర్పడింది. దీన్ని అవకాశంగా తీసుకుందామనే జాతీయ పార్టీలకు స్టాలిన్ అడ్డుగా నిలబడ్డారు. శశికళ, అన్నామలైల ద్వారా తమిళనాట ప్రయోగం చేద్దామనుకున్న బీజేపీ బోల్తా పడింది. లేటెస్ట్‌గా తమిళ దళపతి విజయ్ సినిమాలకు బ్రేక్ ఇచ్చి రాజకీయాల్లోకి వచ్చారు. మరో రెండేళ్లలో జరిగే తమిళనాడు ఎన్నికల్లో ప్రధాన పోటీ డీఎంకే, విజయ్ పార్టీ ౧౨ఐ మధ్యే ఉండే అవకాశాలు ఎక్కువగా కనబడుతున్నాయి. విజయ్ కూడా తన



సినిమాల ద్వారానో, అభిప్రాయాల ద్వారానో పూర్తిగా ద్రవిడ భావజాలాన్ని ప్రకటిస్తూ వచ్చారు. "మెర్సల్" సినిమాలో ఊూ పై తను పేల్చిన డైలాగ్స్ దేశవ్యాప్తంగా పెద్ద చర్చనే రేపాయి. ఆ టైంలో ఢిల్లీ పెద్దల ఆగ్రహానికి గురైన ఘటనలు కథనాలుగా చూసాం. మరోవైపు స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ తమిళనాడు ఉప ముఖ్యమంత్రి హోదాలో ప్రస్తుతం ఉన్నారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ ఆయన ఇచ్చిన స్టేట్మెంట్ ఏ రేంజ్‌లో ప్రకంపనలు సృష్టించాయో తెలిసిందే. సో భవిష్యత్తులో తమిళనాడులో పార్టీలు తమలో తాము ఎంతగా కొట్లాడుకున్నా మత ఆధారిత రాజకీయాలవైపు మొగ్గు చూపే ఛాన్స్ లేదు. దీనినే ఒక అవకాశంగా పవన్, ఆయన సన్నిహితులైన ఢిల్లీ పెద్దలు భావిస్తున్నారని సమాచారం. అసలు తమిళనాడు అనేది పొలిటికల్‌గా జాతీయ పార్టీలకు చాలా అవసరం. యూపీఏ కావొచ్చు, ఎన్డీఏ కావొచ్చు వాళ్ల ప్రవేశపెట్టే చాలా నిర్ణయాలకు తమిళ ఎంపీల మద్దతు అవసరం. 39 మంది ఎంపీలు ఉన్న తమిళనాడు రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఏకతాటిపైనే ఉంటూ వచ్చింది. పార్టీలు వేరైనా రాష్ట్ర ప్రయోజనాలు అంటే మాత్రం ఏకమైపోతారు అక్కడి రాజకీయ నేతలు. అందుకే జాతీయ పార్టీల వ్యూహాలు అక్కడ పనిచేయడం లేదు. పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు ఇలా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించినది ఏదైనా సరే కేంద్ర ముక్కుపిండి మరీ తమిళ పార్టీలు పట్టుకెళ్ళిపోతాయి. అందుకే ఎలాగైనా సరే తమిళ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి పట్టు బిగించాలనేది పవన్, ఆయన ఢిల్లీ స్నేహితుల అజెండాగా కనబడుతోంది. తన సనాతన ధర్మ పరిరక్షణ ప్రసంగాలతో సంచలనం సృష్టిస్తున్న పవన్ మొదట్లో తమిళ నటుడైన కార్తీ, అక్కడ బాగా పట్టున్న ప్రకాష్ రాజ్‌ను టార్గెట్ చేసినట్టు కనిపించినా.. నిన్న పేరు చెప్పకపోయినా ఉదయనిధి స్టాలిన్‌ను విమర్శించినా తమిళ రాజకీయాలను దృష్టిలో పెట్టుకునే అన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అన్నామలై లాంటి వాళ్ళ ఆవేశ పూరిత రాజకీయాల ద్వారా తమిళ ప్రజల్లోని ఒక సెక్షన్‌లో ప్రభావం పెంచుకుంది బీజేపీ. ఇప్పుడు సినీ రంగంలో పవర్ స్టార్ స్థాయిలో ఉన్న తమ స్నేహితుడు పవన్‌ని ఉపయోగించుకుని తమిళనాట బాగా చొచ్చుకుపోయే వ్యూహం పన్నిందనేది పొలిటికల్ ఎనలిస్టుల అంచనా. దానికి తగ్గట్టుగానే పవన్ అడుగులు కదుపుతున్నారని అందుకే పనికట్టుకుని మరీ తమిళ ఇంటర్వ్యూలు, తమిళ స్పీచ్‌లు ఇస్తూ తమిళ ప్రజల అభిమానం పొందే పనిలో పడ్డారనే వాదన కూడా వినిపిస్తోంది. అసలే తమిళ నాట భాషాభిమానం, సినీ అభిమానం ఓ రేంజ్ లో సక్సెస్ అయిన ఫార్ములాలు. వాటికి తోడు సనాతన ధర్మ రక్షకుడిగా ఓ కొత్త వాదనతో తమిళ రాజకీయాల వైపు పవన్ అడుగులు వేస్తున్న దృశ్యం చాలా స్పష్టంగా కనబడుతుంది అన్న పొలిటికల్ అంచనాలు ఎంతమేర నిజమవుతాయో చూడాలి.

# ఇలా అయితే ఎలా... వైసీపీ కేడర్ అంతర్మధనం

వైసీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై దృష్టి పెట్టకపోవడంపై పార్టీలో నేతల మధ్య చర్చ జరుగుతుంది. ఓటమి తర్వాత నేతలు ఓపెన్ అయిపోతున్నారు. జగన్ ఇలాగే వ్యవహారశైలి కొనసాగిస్తే పార్టీ ఎదగడం కష్టమేనని అంటున్నారు. ఎన్నికల వేళ తీసుకున్న నిర్ణయాలను వెనక్కు తీసుకుని ఇప్పటికైనా నేతలకు పట్టున్న నియోజకవర్గాల్లో వారిని ఇన్‌ఛార్జులుగా నియమిస్తే క్యాడర్ ను కాపాడుకుంటారని చెబుతున్నారు. కానీ జగన్ కు మాత్రం ఇగో అడ్డం వస్తున్నట్లుంది. అందుకే ఆయన నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల నియామకంపై ఎలాంటి నియామకాలు చేపట్టలేక పోతున్నారు. జిల్లా అధ్యక్షులను మాత్రమే నియమిస్తూ మళ్లీ నేతలపై పెత్తనానికి కొందరిని వదులుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలను అనేక మందిని నియోజకవర్గాలను బదిలీ చేశారు. ఒకరి నియోజకవర్గాలకు వేరే వారిని అప్పగిస్తూ టిక్కెట్లను కేటాయించారు. కానీ మొన్నటి ఎన్నికల్లో జగన్ వ్యూహం బెడిసి కొట్టింది. కేవలం పదకొండు నియోజకవర్గాల్లో మాత్రమే వైసీపీ విజయం సాధించింది. ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చినా ఫలితం లేదు. వారిపై వ్యతిరేకత ఉందని మార్చారనుకున్నారు కానీ, తన ప్రభుత్వంపై ప్రజల్లో ఇంతటి వ్యతిరేకత ఉందని ఊహించ లేకపోయారు. అంచనా ఊహకు కూడా అందకపోవడంతోనే జగన్ అలాంటి నిర్ణయం తీసుకున్నారు. అంతా ఐప్యాక్ టీం చెప్పినట్లే చేశానంటూ చేతులు దులిపేసుకున్నారు. దీంతో అయిష?టంగానే ఆ నియోజకవర్గాలకు వెళ్లిన నేతలకు ఓటమి ఎదురు కావడంతో అక్కడ పార్టీని పట్టించుకోవడం మానేశారు. పాత వారు కూడా వదిలేశారు. దీంతో ఆ నియోజకవర్గాల్లో క్యాడర్ అనాథలుగా మారిపోయారు. నేతలు లేక క్యాడర్ కూడా చెల్లాచెదురు కాకముందే అక్కడ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులను నియమించాల్సిన అవసరం ఉందన్నది పార్టీ నేతల అభిప్రాయం. పాత వారికే తిరిగి అవకాశమిస్తే వారు



తిరిగి ఆ నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేస్తారంటున్నారు. కానీ జగన్ మాత్రం పార్టీని పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో ఆ నియోజకవర్గాల్లో నేతలు లేకపోవడంతో క్యాడర్ ను కూటమి ఎమ్మెల్యేలు లాగేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో వైఎస్ జగన్ ఇలా చేతులు ముడుచుకుని కూర్చుంటే రేపు స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీస పోటీ ఇచ్చేందుకు కూడా అవకాశముండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఇప్పటికీ వైసీపీని అభిమానించే క్యాడర్ అనేక మంది ఉన్నప్పటికీ వారికి అండగా నిలిచే నేత లేక డీలా పడిపోయింది. మరోవైపు అధికారంలో ఉన్నపార్టీ హామీలను అమలుపర్చకపోవడంతో ప్రజల్లో కొంత అసంతృప్తి బయలుదేరింది. దానిని క్యాష్ చేసుకునేందుకు లీడర్లు అవసరం. కానీ జగన్ ఇలా కాలయాపన చేస్తూ వెళితే పార్టీ చేతుల్లో నుంచి చేజారిపోతుందన్న ఆందోళన నేతల్లో కనిపిస్తుంది కాని జగన్ లో మాత్రం వీసమెత్తు కనిపించడం లేదని, తిరిగి తనవల్లనే పార్టీ పుంజుకుంటుందన్న ధోరణిలో ఉన్నారంటున్నారు నేతలు. మరి జగన్ తీసుకునే నిర్ణయంపైనే పార్టీ ఆధారపడి ఉంటుందన్నది పార్టీ బలంగా వినిపిస్తున్న టాక్.

# చైర్మన్ పై కోర్టు బాణం...

**విజయవాడ :** ఆ ముగ్గురు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు.. కానీ ఆయన ఆమోదించలేదు. వీళ్లు వెయిట్ చేస్తున్నారు.. కానీ ఆయన నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేదు. వీళ్ల కళ్లు కాయలు కాస్తున్నాయి. వెనక చాలా మంది క్యూలో ఉన్నట్లున్నారు. కానీ.. ఆయన మాత్రం.. ఊహూ? అస్సలు తగ్గనంటున్నారు. ఇదంతా ఎక్కడనేగా.. ఏపీలో వైసీపీ ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం. ఇలా కాదని.. అవసరమైతే న్యాయపోరాటం చేసైనా తమ రాజీనామాల్ని ఆమోదించుకోవాలనేది ఆ ముగ్గురు ఎమ్మెల్సీల ప్లాన్.. మరి అది వర్కవుట్ అవుతుందా?? ఏపీలో టిట్ ఫర్ టాట్ పాలిటిక్స్ బాగానే నడుస్తున్నాయి. ప్రస్తుతం ఏపీ శాసనమండలిలో వైసీపీ 38 మంది ఎమ్మెల్సీల సంఖ్యాబలం ఉంది. శాసనసభలో 11 మందికే పరిమితమైనా.. మండలిలో మాత్రం వైసీపీదే ఆధిపత్యం. దీంతో ఏ బిల్లు పాస్ కావాలన్నా శాసనమండలిలో వైసీపీ సభ్యులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సిన పరిస్థితి. వైసీపీ అధినేత జగన్ ఓడిన కొత్తలో ఎమ్మెల్సీలను చూసి మీరే నా బలం.. నా బలగం.. నాఆశ అన్నారు. కానీ.. పార్టీలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఎవరి వెర్షన్లో వాళ్లు ఆలోచిస్తూ ఉన్నారు. ఎమ్మెల్సీలను పిల్లల కోడిలా రెక్కల కింద దాచుకుందామనుకున్న జగన్‌కు కూటమి నుంచి ఆపరేషన్ ఆకర్ష్ మొదలైంది. అలా ముగ్గురు ఎమ్మెల్సీలు వైసీపీ గూడు వీడి బయటకొచ్చేశారు. వైసీపీకి చెందిన పోతుల సునీత, కర్రి పద్మశ్రీ, బల్లి కల్యాణ్ చక్రవర్తి తమ పదవులకు రాజీనామా చేశారు. అయితే రాజీనామాల్ని ఆమోదించాల్సినది శాసనమండలి చైర్మన్. ఇక్కడే వారికి చిక్కొచ్చి పడింది. మండలి చైర్మన్‌గా వైసీపీ అధినేత జగన్ వీర విధేయుడు కొయ్యే మోషేన్ రాజు ఉన్నారు. ఇద్దరు ఎమ్మెల్సీలు నేరుగా మోషేన్ రాజునే కలిసి రాజీనామాలు సమర్పించారు. రెండు నెలలుగా చైర్మన్ ఆఫీసు నుంచి రాజీనామాలు ఆమోదం పొందినట్లు ఎలాంటి ప్రకటన లేదు. ఆ సీట్లు ఖాళీ అయ్యాయంటేనే కేంద్ర ఎన్నికల సంఘం ఎలక్షన్ నిర్వహిస్తుంది. అప్పుడు టీడీపీకి చెందిన ఆశావహులకు మ్మెల్సీలుగా చాన్స్ దక్కుతుంది. అలా మెల్లగా వైసీపీ బలాన్ని మండలిలో తగ్గిద్దామనుకున్న కూటమి స్కెచ్‌కు వైసీపీ నేత, మండలి చైర్మన్ బ్రేక్ వేసినట్లయ్యింది. రాజీనామాలను ఆమోదించిఉంటే ఇప్పటికే మండలిలో సగం వైసీపీ సభ్యులు ఖాళీ అయ్యేవారని అంటున్నారు. ఏపీలో మండలి, ఎమ్మెల్సీల రాజీనామాల వ్యవహారం చూస్తే.. తెలంగాణలో అసెంబ్లీ స్పీకర్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల రిసిగ్నేషన్లే గుర్తుకొస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి వెళ్లిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే బీఆర్ఎస్ మాత్రం పార్టీ మారిన ఎమ్మెల్యేల రాజీనామాలు ఆమోదించి.. అనర్హులుగా ప్రకటించాలని తెలంగాణ స్పీకర్‌ను విన్నవించారు. కానీ అక్కడా ఎలాంటి స్పందనా లేదు. దీంతో కోర్టుకెక్కింది బీఆర్ఎస్. ఏపీ శాసనమండలి విషయంలో కూడా చైర్మన్ రాజీనామాలు ఆమోదించకుంటే తమకు న్యాయపోరాటమే గతి అని వైసీపీని వీడిన ముగ్గురు ఎమ్మెల్సీలు ఆలోచనలో పడ్డారు.

## పర్యాటక శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారు

**విశాఖపట్నం:** విశాఖపట్నంలో మంత్రి కందుల దుర్గేష్ ఇవాళ(ఆదివారం) పర్యటించారు. బీచ్ రోడ్డులో ఉన్న టూరిజం యాత్రి నివాస్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వంలో పర్యాటక శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించడంతో పర్యాటక శాఖ తీవ్రంగా నష్టపోయిందని మంత్రి కందుల దుర్గేష్ ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖలోని యాత్రి నివాస్ నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ముందు కొత్త టెండర్ పిలిచి తర్వాత, టెండర్ ఏం లేకుండా పనులు చేయమన్నారని గుర్తుచేశారు. అసలు ఏం జరిగిందనే విషయంపై సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. ఏపీలో చాలా ప్రాజెక్టులు పునర్నిర్మాణం పేరుతో నిర్లక్ష్యం చేయడంతో ప్రస్తుతం పనులు నిలిచిపోయాయని అన్నారు. వైసీపీ చర్యలతో పర్యాటక రంగం ఆదాయాన్ని కోల్పోయే పరిస్థితి వచ్చిందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఎంవీ మా షిప్‌ను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మాటిచ్చారు. దీనికి సంబంధించి కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ విషయంపై కేంద్రంతో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడారని.. సరిచేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అనంతరం విశాఖపట్నం నుంచి బొర్రా కేవ్స్, అరకు ప్రాంత సందర్శనకు మంత్రి దుర్గేష్ వెళ్లారు.

## పుంగనూరు బాలిక కుటుంబానికి న్యాయం చేస్తాం

**అమరావతి :** చిత్తూరు జిల్లా పుంగనూరు లో హత్యకు గురైన బాలిక కుటుంబానికి న్యాయం చేసి ఆదుకుంటామని ఏపీ సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. బాలిక కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మంత్రులు ఫరూఖ్, రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం నాడు పుంగనూరులో బాలిక కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా బాలిక కుటుంబ సభ్యులు చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడించారు. ఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ సెప్టెంబర్ 29న బాలిక అదృశ్యం కాగా అదే రోజు రాత్రి 11 గంటలకు ఫిర్యాదు చేశారని తెలిపారు. బాలిక అచూకి కోసం ఎస్పీ వెంటనే 11 బృందాలను ఏర్పాటు చేశారని వివరించారు. మూడు రోజుల తర్వాత బాలిక మృతదేహం లభ్యమైందని తెలిపారు. డాక్టర్ల ప్రాథమిక నివేదిక ఆధారంగా బాలికపై అత్యాచారం జరుగ లేదన్నారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని, మరో ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారని వివరించారు. అయితే ఘటనపై జగన్ రాజకీయం చేయడం సరికాదని అన్నారు.

## భారీ స్కెచ్‌తో ఢిల్లీకి చంద్రబాబు

-మొదటిపేజీ తరువాయి

నిలిచిపోయింది బిజెపి బలం. సరిగ్గా అటువంటి సమయంలోనే నేనున్నాను అంటూ చంద్రబాబు ఎన్డీఏ ఊపిరిలూదారు. మూడోసారి ఎన్డీఏ సుస్థిరతకు చంద్రబాబు అవసరం అనివార్యంగా మారింది. దీంతో చంద్రబాబు ఇమేజ్ అమాంతం పెరిగింది. కేంద్ర ప్రభుత్వంలో టిడిపి చేరింది. టిడిపి కూటమి ప్రభుత్వంలో బిజెపి భాగస్వామ్యం అయ్యింది. అయితే చంద్రబాబు ఇక్కడే ఒక ఎత్తుగడ వేశారు. రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తూ కేంద్రం సాయాన్ని పొందేలా పక్కాగా ప్లాన్ చేశారు. అందులో భాగంగానేఅమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్ర బడ్జెట్లో 15 వేల కోట్ల రూపాయల సాయం దొరికింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సైతం నిధుల కేటాయింపు జరిగింది. ఈ ఐదేళ్లపాటు ఇలానే సాఫీగా వెళ్లిపోవాలని చంద్రబాబు భావిస్తున్నారు. వీలైనంత వరకు భారీగా కేంద్రం నుంచి నిధులు సమీకరణ చేయాలని భావిస్తున్నారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్తున్న ప్రతిసారి రాష్ట్రానికి ఏదో ఒక ప్రయోజనందక్కుతూ వస్తోంది. ఈ తరుణంలో ఈ నెల ఏడున చంద్రబాబు ఢిల్లీ వెళ్ళనున్నారు. దీంతో కేంద్ర సాయం పై ఇప్పుడే చర్చ ప్రారంభం అయ్యింది. చంద్రబాబు రెండు రోజులు పాటు ఢిల్లీలో ఉండనున్నారు. ఈనెల 7న ఢిల్లీ బయలుదేరి వెళ్తారు. 8వ తేదీ సాయంత్రం తిరిగి అమరావతికి వస్తారు. ఢిల్లీ పర్యటనలో ప్రధానంగా విశాఖ ఉక్కు పై కేంద్ర ఆర్థిక, ఉక్కు శాఖల మంత్రుల ఆధ్వర్యంలో జరిగే కీలక సమావేశంలో పాల్గొంటారు. అనంతరం ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలతో భేటీ అవుతారని తెలుస్తోంది. అయితే దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఏపీకి రావలసిన కీలక ప్రాజెక్టులతోపాటు అమరావతి రాజధాని, పోలవరం నిర్మాణం పై వారితో చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను చంద్రబాబు కలిసి చర్చలు జరపనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విశాఖ రైల్వే జోన్ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. కేంద్రం ఆమోద ముద్ర వేసిన విషయం విధితమే. విశాఖ రైల్వే జోన్ భూమి పూజ ముహూర్తం పై రైల్వే శాఖ మంత్రి తో చర్చించబోతున్నట్లు సమాచారం. రాజధాని అమరావతికి ప్రపంచ బ్యాంకు నిధులు, పోలవరం అంశం పైన చర్చించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రానికి వరద సాయంతో పాటు ఇతర కేంద్ర ప్రాజెక్టులు, ఏపీకి సంబంధించిన ముఖ్య అంశాలపై కేంద్ర పెద్దలతో సీఎం చర్చిస్తారని అధికార వర్గాలు చెబుతున్నాయి.

## ఇక్కడ ఎదురు చూపులేనా

**విజయనగరం :** విజయనగరంలో జిల్లాలో ఈ అసెంబ్లీ వైసీపీ చిత్తుగా ఓడిపోయింది. కానీ అక్కడ పార్టీ మాత్రం బలంగానే ఉంది. నేతల మధ్య ఆధిపత్య పోరుతో కేడర్ అయోమయం కారణంగా చాలామంది బయటకు వచ్చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ముఖ్యంగా విజయనగరం మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిని తట్టుకోలేక చాలామంది వైసీపీ నేతలు రాంరాం చెప్పేశారు. తమకు అండగా ఉంటారనుకున్న మాజీమంత్రి బొత్స, జెడ్పీ చైర్మన్ చిన్న శ్రీను వంటి నేతలు కూడా విజయనగరం నియోజకవర్గ రాజకీయాల్లో వేలు పెట్టే సాహసం చేయలేకపోయారు. తమ అనుచరులకు భరోసా ఇవ్వలేకపోవడంతో సీనియర్లయిన పిల్లా విజయకుమార్ వంటి నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరిపోయారు. వైసీపీ స్థాపించిన మొదట్లో తొలి సభ్యత్వం తీసుకుని జిల్లాలో మొదటిసారి జెండా ఎగరేసిన వారిలో అవనాపు విక్రమ్, విజయ్ సోదరులు ఉండేవాళ్లు. అయితే కొన్ని రాజకీయ కారణాలతో వాళ్లిద్దరూ వైసీపీని వీడి చెరోదారి చూసుకున్నారు. ఒకరు జనసేన, మరొకరు టీడీపీలో చేరిపోయారు. అవనాపు ఫ్యామిలీతో పాటు పలువురు విజయనగరం నేతలు ఆ తర్వాత వైసీపీని వదిలారు. అవనాపు సూరిబాబు మరణంత తర్వాత మాజీమంత్రి పెన్మత్స సాంబశివరావు అడుగు జాడల్లో నడుస్తూ ఎమ్మెల్యే టికెట్‌కు 7ప్రయత్నించారు అవనాపు విక్రమ్, విజయ్. అదే టైంలో కోలగట్ల కాంగ్రెస్‌ను వదిలి వైసీపీలోకి వచ్చారు. 2014 ఎన్నికల్లో ఆయనకు టికెట్ దక్కడంతో అవనాపు బ్రదర్స్ అవమానంగా ఫీలయ్యారు. 2019లోనూ సేమ్ సీన్ రిపీట్. దీంతో వైసీపీలో ఎంత పనిచేసినా తమకు గుర్తింపు లేదని.. కోలగట్ల కారణంగా తమను పక్కన పెడుతున్నారన్న భావన కలిగింది. మాజీమంత్రి బొత్సకు అనుచరుల్లా మసులుకున్నా.. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఈ సోదరులకు కోలుకోలేని దెబ్బ వేశాయి. కనీసం కార్పొరేటర్లుగా పోటీ చేసేందుకు కూడా వీరికి అవకాశం దక్కలేదు. అప్పట్లో ఉత్తరాంధ్ర వైసీపీ కోఆర్డినేటర్‌గా ఉన్న విజయసాయిరెడ్డి ముందు ఇదే విషయాన్ని బోరున వెళ్లగక్కినా ఫలితం లేకుండా పోయింది. దీంతో కోలగట్ల, అవనాపు బ్రదర్స్ మధ్య గ్యాప్ బాగా దూరమైంది. ఇలాను ఉంటే కుదరదని ఆ సోదరులు చెరోదారి వెతుక్కున్నారు. ఎన్నికల ముందు టీడీపీలో చేరిపోయారువిక్రమ్ కుటుంబం జనసేన పార్టీకి దగ్గరైంది. విజయ్ ఫ్యామిలీ టీడీపీలో చేరింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ఏర్పడటంతో వీళ్లిద్దరూ ఒకే గూటికింద పనిచేసే చాన్స్ మళ్లీ వచ్చింది. 14 ఏళ్లు వైసీపీకి అండగా ఉంటూ.. ఆర్థికంగా కూడా సహాయ సహకారాలిచ్చిన తమను అధినేత జగన్ మోసం చేశారన్న భావనలో వీరిద్దరూ పార్టీలు మారినా.. ఇప్పటి వరకు అనుకున్న స్థాయిలో రాజకీయంగా ఎదగలేకపోయారు. జిల్లాలో మంచి పట్టున్న అవనాపు ఫ్యామిలీ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బలంగానే ఉంది. అయితే ప్రస్తుతం జనసేనలో కూడా వారికి ఇలాంటి ఆధిపత్య పోరే ఎదురవుతోంది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలవలస యశస్విని, గురాన అయ్యలు వంటి నేతలు ముందు వరసలో ఉన్నారు. దీంతో అవనాపు విక్రమ్ దంపతులకు మరోసారి గడ్డుకాలం ఎదురైంది. టీడీపీలో కొనసాగుతున్న అవనాపు విజయ్ కూడా ఎమ్మెల్యే అదితి గజపతిరాజును నమ్ముకొనే అడుగులు వేస్తున్నారు. భవిష్యత్ లో రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలైన తమ రాజకీయ భవిష్యత్తుకు మంచి బాటలు వేస్తాయని గంపెడాశాలతో ఉన్నారు. మొత్తానికి వేర్వేరు పార్టీలైనా.. ఇద్దరు సోదరులు ఒకే కూటమి గూటికి చేరుకోవడం కొంత రిలీఫ్. మరి భవిష్యత్ లో వీరికి ఎలాంటి చాన్స్‌లు వస్తాయో వెయిట్ అండ్ సీ..

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

# ప్రకాశం




# నెల్లూరు స్మార్ట్‌సిటీ దిశగా మంత్రి నారాయణ వ్యూహాత్మక అడుగులు

మంత్రి కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులతో సమీక్ష సమావేశం

అందరి సమన్వయంతో ప్రజల అభిష్టం మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలని సూచనలు

సమస్య ఎక్కడ ఉన్న నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు

పలు కీలక అంశాలపై దిశానిర్ధేశం చేసిన

రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 6)**

నెల్లూరును ఆంధ్రరాష్ట్రంలోనే ఓ మంచి మోడల్‌సిటీగా ప్రజల అభిష్టం మేరకు తీర్చిదిద్దేందుకు వ్యూహాత్మకంగా అందరి సమన్వయంతో ముందుకు అడుగులు వేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. నెల్లూరులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సిటీ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ అధ్యక్షులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి నారాయణ డివిజన్ అధ్యక్షులకు సూచనలు చేశారు. అందరి సమన్వయంతో ప్రజల అభిష్టం మేరకు అభివృద్ధిపనులు చేపట్టాలని సూచించారు. ఆయా డివిజన్ల పరిధిలో సమస్యలు ఎక్కడ ఉన్న తమ దృష్టికి తీసుకునిరావాలని, అదేవిధంగా ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని వారికి తెలియజేశారు. ప్రధానంగా డివిజన్లలో పారిశుధ్యపనులు, స్థానిక సమస్యలు, తదితర అంశాలపై దృష్టిసారించాలని సూచించారు. నెల్లూరును స్మార్ట్‌సిటీగా మార్చుకునేందుకు అందరి సమన్వయం అవసరమన్నారు.

# ఉడా వైస్ ఛైర్మన్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరణ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 6)**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆదివారం ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటి వైస్ ఛైర్మన్‌గా ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వారి ఉత్తర్వుల ఆదేశాల మేరకు ఆదివారం ఆయన ఉడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కార్యాలయ సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటీ పని తీరు, చేపట్టతగిన అభివృద్ధి పనులు, ప్లానింగ్ విభాగం పనితీరు, బిల్డింగ్, పారిశ్రామిక అప్రూవల్స్ గురించి క్షుణ్ణంగా పరిశీలించారు. అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆఫీసు భవనం కొరకు సరైన స్థలాన్ని గుర్తించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనధికార లే అవుట్స్ పట్ల కఠినంగా వ్యవహరించాలని, ఈ విషయంలో సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్య వైఖరి వహించినా సహించేది లేదన్నారు. ఇంజనీరింగ్ విభాగం నందు ప్రపోజ్ చేయు అభివృద్ధి పనులను సైట్ ఇన్స్‌పెక్ట్ చేసి ప్రాధాన్యత, పట్టణ ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం వినూత్నమైన ప్రాజెక్టు చేయాలని తెలిపారు. ఒంగోలు అథారిటీ డెవలెప్మెంట్ అథారిటీ పరిధిలోని అన్ని కార్యక్రమాలను క్రమబద్ధీకరణ చేసి సమర్థవంతంగా పని చేయాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు.





# సైనికుల సేవకు ఎంత చేసినా తక్కువే

92 ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సెలబ్రేషన్స్‌లో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

సైనిక స్మారక స్థూపానికి, సైనిక భవనానికి సహకరిస్తానని హామీ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 6)**

దేశ రక్షణ కవచంగా ఉంటూ ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడుతున్న వీర సైనికులకు వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఎంత చేసినా తక్కువేనని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు అన్నారు ఒంగోలు అంబేద్కర్ భవనంలో 92వ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వేడుకల సందర్భంగా అయన ముఖ్య అతిథిగా







ప్రసంగించారు. ఎంతోమంది వీర సైనికులు దేశ సరిహద్దుల్లో కాపలా కాయబట్టే దేశ ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉంటున్నారని, అటువంటి ఆర్మీకి ఎంతైనా రుణపడి ఉంటామని అన్నారు. ఎన్నోసార్లు మాజీ సైనికులు స్మారక స్థూపం , సైనిక భవన్ గురించి అడగడం జరిగిందని,సాధ్యమైనంత త్వరలో వారి కోరికను నెరవేర్చడం తన బాధ్యతగా తీసుకుంటానని చెప్పారు. విజయవాడ వరద బాధితుల కోసం సహాయం అందించిన ఒంగోలు మాజీ సైనిక సంఘానికి ఆయన అభినందనలు తెలిపారు. సైనిక సంక్షేమ అధికారిరజిని కుమారి,మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఆలపాటి వెంకటేశ్వర్లు, జిల్లా సైనిక్ సంక్షేమ సంఘం

4

**(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, అక్టోబర్ 6)**

మానసిక దృఢత్వం కోల్పోయి ప్రేమించిన వ్యక్తి వదిలి వెళ్లిపోవడంతో రైలు కింద పడి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడబోయిన వ్యక్తిని సింగరాయకొండ సిఐ హజరత్తయ్య, హెూంగార్డు సురేష్‌లు అడ్డుకుని కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. సింగరాయకొండ లోని సోమరాజుపల్లి రైల్వే గేటు వద్ద ఆదివారం సాయింత్రం ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి సిద్ధమయిన సమాచారంతో సిఐ చావా హాజరత్తయ్య స్పందించి తన సిబ్బందితో సంఘటన ప్రదేశానికి హుటాహుటిన చేరుకున్నారు. వెంటనే ఆత్మహత్యాయత్నానికి సిద్ధమయిన వ్యక్తిని కాపాడి అతని వివరాలు తెలుసుకున్నారు. వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి దారితీసిన కారణాలు, పరిస్థితులు గురించి బాధితుడు తన బాధని పోలీసులకు మొరపెట్టుకున్నాడు. పశ్చిమ బెంగాల్ సిరిగిరి ప్రాంతానికి చెందిన షేక్ షబ్బీర్ అన్సారి రెండు దశాబ్దాలుగా కందుకూరు

# వికటించిన ప్రేమ

ఆత్మ హత్యాయత్నానికి సిద్ధమయిన ప్రేమికుడు

సమాచారం తెలియడంతో సదరు వ్యక్తిని రక్షించిన సిఐ హజరత్తయ్య, హెూంగార్డ్ సురేష్

జనార్ధన కాలనిలో ఉంటూ ఫాల్ సిలింగ్ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. సుమారు నాలుగు సంవత్సరాల నుండి హైదారాబాద్‌కి చెందిన అమ్మాయితో కలిసి సహజీవనం చేస్తున్నాడు. అయితే తన ప్రేమికురాలు తన ప్రియుడితో గొడవ పడి ప్రియుడి వద్ద నుండి దూరంగా తన తల్లి దండ్రుల వద్దకు వెళ్లింది. తన ప్రేమికురాలు తనను వదిలి తల్లిదండ్రుల వద్దకు పోయి తిరిగి తన వద్దకు చేరలేదని మనస్తాపానికి గురయ్యాడు. మనస్తాపంతో షబ్బీర్ ఆదివారం సాయింత్రం ఆత్మహత్యా యత్నానికి సిద్ధమయిన సమాచారంతో సిఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని అతడిని ఆత్మహత్యాయత్నం నుండి కాపాడి సర్కిల్ ఆఫిస్‌కి తరలించి బాధితుడు బంధువులను పిలిపించి అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి అతనిని వారి బంధువులకు అప్పగించారు. మనస్థాపంతో ఆత్మహత్యాయత్నానికి సిద్ధమయిన తమ కుటుంబ సభ్యుడిని కాపాడి అప్పగించి సిఐ చావా హాజరత్తయ్య సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.




# దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యే ముత్తుములకు ఆహ్వానం



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 6)**

ముండ్లపాడు గ్రామ శ్రీ సీతారామాంజనేయ స్వామీ దేవస్థాన కమిటీ సభ్యులు దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. మండలంలోని ముండ్లపాడు గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవికి దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు అంగరంగ వైభవంగా చేస్తారు. దసరా నవరాత్రి ఉత్సవాలకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వారి సతీమణి, సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్‌రెడ్డికి ఆహ్వానం అందించారు. (తరువాయి 4లో...)



## దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యే ముత్తుములకు ఆహ్వానం






అశ్వయుజ మాసంలో జరిగే ఈ ఉత్సవాల్లో అమ్మవారి నక్షత్రం మూల నక్షత్రం రోజు సాయంకాల సమయంలో సరస్వతి దేవి అలంకరణలో కుంకుమ పూజ కార్యక్రమం ఉంటుందని, అలాగే ఈ నెల 13వ తేది ఆదివారం సాయంత్రం అమ్మవారికి ఉయ్యాల పేరంటం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముండ్లపాడు గ్రామ ఉపసర్పంచ్ కడియం శేషగిరిరావు, బొమ్మినేని వెంకటేశ్వర్లు, ముండ్లపాడు గ్రామ శ్రీ సీతారాంజనేయస్వామీ దేవస్థానం కమిటీ ప్రెసిడెంట్ శివాపురం ధనుంజయ గుప్తా, సెక్రటరీ శివాపురం సత్యనారాయణ, ట్రెజరర్ మునగనూరి సుబ్బరంగయ్య, శివాపురం ప్రసాద్, శివాపురం కుమార్, గంగిశెట్టి రామసుబ్బారావు, శివాపురం రాజా, మునగనూరి నాగేంద్ర, ముండ్లపాడు గ్రామ ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## సైనికుల సేవకు ఎంత చేసినా తక్కువే



డైరెక్టర్ కే వెంకటరెడ్డి, మాజీ సైనిక సంక్షేమ సంఘం చైర్మన్ నెప్పలి నాగేశ్వరరావు డాక్టర్ల ఆనంద్ డాక్టర్ రవీంద్ర,డాక్టర్ కటారి వాసంతి తదితరులు పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన కరవధి రవీంద్ర భారతి స్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు ఆత్మీయ సత్కారం నిర్వహించారు.

## కంభం పట్టణంలో దొంగల హల్చల్



**(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 6)**

కంభం పట్టణంలోని స్థానిక గణేష్ నగర్ లో ఆరు తులాల బంగారం 5000 రూపాయలు నగదు చోరీ. గణేష్ నగర్ లో నివాసం ఉంటున్న రాజు అనే వ్యక్తి అతను భార్యతో కలిసి గిద్దలూరు మండలం దేవనగరం అనే గ్రామానికి ఒకటోవ తేదీన వెళ్లి తిరిగి ఐదవ తేదీన సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తలుపును పగలగొట్టి ఇంటి లోపల ఉన్న బీరువాలో ఆరు తులాల బంగారం 5000 రూపాయలు నగదును గుర్తుతెలియని దుండగులు అపహరించుకున్నారు. ఇది గమనించిన ఇంటి యజమాని వెంటనే పోలీస్ వారికి సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించి, సీఐ, ఎస్ఐ క్లూస్ టీమ్ రంగంలో దిగి వేలిముద్రల ను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మాల ఉద్యోగులు మోకాళ్ళపై కూర్చొని వినూత్న నిరసన

### సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా కొవ్వొత్తులతో ప్రదర్శన
### మోకాళ్ల పై నిల్చొని ఆందోళన
### అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేత

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 6)**

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు వేసిన రివ్యూ పిటిషన్ తిరస్కరిచ్చినందుకు మాల ఉద్యోగులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. రిజర్వేషన్ వర్గీకరణకు, క్రిమిలేయరుకు వ్యతిరేకంగా, సుప్రీంకోర్టు లో మాలలు వేసినటువంటి రివ్యూ పిటిషన్ తిరస్కరించ డాన్ని ప్రకాశం జిల్లా మాల ఉద్యోగులు ఆందోళనకు దిగారు. కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దళితులకు రిజర్వేషన్ ఫలాల్ని దూరం చేయాలన్న దుర్బుద్ధితో, వర్గీకరణ ప్రవేశపెట్టి రాజ్యాంగం హక్కుల్ని దూరం చేయాలనుకుంటున్నా కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు చివరికి సుప్రీంకోర్టు సైతం మాలల న్యాయమైన కోరికల్ని సుప్రీంకోర్టులో తోచి పుచ్చటం సిగ్గుచేటన్నారు. భారత దేశంలోని ఆంధ్ర, తెలంగాణ, తప్పక యాదవ్ దేశం లో అన్ని రాష్ట్రా లు వర్గీకరణ వ్యతిరేకిస్తున్న అప్పటికీ సుప్రీంకోర్టు తన వైఖరిని మార్చుకో పోవటం భారత రాజ్యాంగాన్ని అగౌరవ పరచడ మే అని కనుక వర్గీకరణకు వ్యతిరేకంగా క్రిమిలేయర్ వ్యతిరేకంగా మాలలు భవిష్యత్తులో పెద్ద ఎత్తున ప్రభుత్వాలకి తమ యొక్క నిరసన రాస్తారోకో, ద్వారా పెద్ద ఎత్తున ఉద్యమం మాల ఉద్యోగులు మాల ఉద్యోగుల రాష్ట్రా అధ్యక్షుడు తుల్లి బిల్లి అశోక్ బాబు, జిల్లా అధ్యక్షుడు జి.హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్ ఉపాధ్యక్షులు కాటు కూరి బాబురావు, శ్రీరాములు ,ఆర్గనైజింగ్ సెక్రటరీ జనార్దన్, కోశాధికారి యరమాల మల్లికార్జునరావు, పాలడుగు వివేకానంద, మిట్నసల శాంతారావు, మరియు కార్యవర్గ సభ్యులు మాల సంఘాల నాయకులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.



## 8న మాగుంట ఒంగోలు పర్యటన



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 6)**

ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ నెల 8వ తేదీన ఉదయం 9.30 గంటలకు మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో వుంటారు. 11.00 గంటలకు ఒంగోలులో ప్రకాశం భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు "స్వర్ణాంధ్ర ఏ 2047" సంబంధించి విధ్య-నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, పర్యావరణ సుస్థిరత, సంఘం, సామాజిక అబివృద్ధి, ఆర్థికాభివృద్ధిపై జిల్లా ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్‌తో జరుగు జిల్లా స్థాయి విజన్ సంప్రదింపులు, సలహాల సమావేశంలో పాల్గొంటారన్నారు. తిరిగి మధ్యాహ్నం 1 గంటలకు ప్రజలకు ఆందుబాటులో ఉంటారని ఆయన కార్యాలయ అధికారులు తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పున పరిశీలించాలి

### దళిత సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు చప్పిడి వెంగళరావు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 6)**



ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పున పరిశీలించాలని దళిత సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు చప్పిడి వెంగళరావు కోరారు. ఆంధ్ర ప్రదేశ్ మాల ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు బిఎస్ఎన్ఎల్ సేవా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్లను, తిరస్క రించడం రాజ్యాంగ వ్యతిరేక మని అన్నారు. మోడీ, ఆర్ఎస్ఎస్ కుట్రలో భాగంగానే కొట్టి వేయడం జరిగిందని అన్నారు. ఉమ్మడి రిజర్వేషన్లను, ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అప్పట్లో వర్గీకరించగా సుప్రీంకోర్టు సంతోష్ హెగ్డే గారితో కూడిన 5గురు ధర్మాసనం ఏకగ్రీవంగా కేట్టివేయగా, ఇటీవల 7గురు ధర్మాసనం వాదనలు విన్నప్పుడు, ఇప్పుడు 9మంది ధర్మాసనం నకు విజ్ఞప్తి చేసుకోవాలని చేసుకున్న రివ్యూ పిటీషన్లు యెలా తిరస్కరిస్తారు అని అన్నారు. 5గురు ధర్మాసనం లో న్యాయం ఏకగ్రీవంగా తీర్పు చెప్పినప్పటికీ న్యాయం జరగ లేదని 7గురు ధర్మాసనం నకు వెళ్ళే రాజ్యాంగ హక్కు వున్నప్పుడు, 7గురు ధర్మాసనం లో 6.1తీర్పులో న్యాయం జరగలేదని, రాజ్యాంగ బద్దంగా రివ్యూలు దాఖలు చేస్తే వాటిని తిరస్కరించడం రాజ్యాంగ వ్యతిరేక ము కాదా అని అన్నారు. ఈ తీర్పు దేశంలో వున్న ఎస్సీ, ఎస్టీలను అభివృద్ధికి అధికారానికి దూరంగా ఉంచడానికి ఇచ్చిన తీర్పు అని దీనిని అంబేద్కర్ వాదులుగా ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని,అన్నారు. ఆంధ్రప్రదేశ్ మాల ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ధర్నాశి చిరంజీవి మాట్లాడుతూ మాల ఉద్యోగులు పట్ల నేటికీ ప్రధాన నగరాలలోని వివక్ష కొనసాగుచున్నదని , ఇల్లు అద్దెకు ఇచ్చే దగ్గర, అపార్ట్మెంట్ లో ప్లాట్లు కొనేదగ్గర, అపార్ట్మెంట్ లోని కమిటీల దగ్గర ఆనేక వివక్షలకు గురికాబడుతున్నారు.ఉద్యోగస్తులుగా మేమే ఇన్ని వివక్షకు గురవుతుండగా, సామాన్య జనం యెన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు., దేశం లో మత గణన, కుల గణన చేయాలన్నారు.అర్హులందరికీ భూపంపిణి జరగాలన్నారు రాజ్యాంగాన్ని కాపాడుకొనే పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, డిసెంబర్ 14న గుంటూరు లో జరుగు మాలల రణ గర్జనను జయప్రదం చేయాలని అన్నారు ఈ సమావేశంలో దళిత మహాసభ రాష్ట్ర కార్యదర్శి సంపత్ కుమార్ చిట్టి మాల, మాల ఉద్యోగుల వుమ్మడి ప్రకాశం జిల్లా చైర్మన్ ఎరిచర్ల సుబ్రమణ్యం, ఉద్యోగ సంఘాల నాయకులు అంగళకుర్తి సుబ్బారావు , మాల మహానాడు నాయకులు మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

## గాండ్ల తెలికుల సంక్షేమానికి ప్రభుత్వం సహకరించాలి





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 6)**

ఆదివారం నెల్లూరు పట్టణంలోని మహేశ్వరి పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గ్రోసు సుబ్బారావు అధ్యక్షతన కార్యనిర్వాహక వర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘ సభ్యుల అభివృద్ధి కొరకు చేపట్టవలసిన కార్యక్రమాలు, రాష్ట్రం మరియు జిల్లాల ఎన్నికలు నిర్వహించుటకు విధివిధానాలు, మరియు గాండ్ల తెలికుల కార్పొరేషన్ కు నిధుల మంజూరు గురించి చర్చించడమైనది. అదేవిధంగా గాండ్ల తెలికుల ఐకమత్యమే అభివృద్ధికి సోపానమని, గాండ్ల తెలికుల సామాజిక వర్గ ప్రజలు విద్యాపరంగా ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ప్రకాశం జిల్లా గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు తంగెళ్ల నాగభూషణం, వరికుంట్ల వెంకటేశ్వర్లు, చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, ఊటుకూరి ప్రసాదు, మాదా నాగేశ్వరరావు, ప్రకాశం జిల్లా యూత్ కన్వీనర్ బోయిల్ల రోషన్ బాబు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న సభ్యులందరికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ సంఘం (ఏజిటియుపిఎస్ఎస్) రాష్ట్ర కార్య నిర్వహణ ప్రధాన కార్యదర్శి దాసరి గురుస్వామి అభినందనలు తెలియజేశారు.

## పిటిపి ఫ్యాక్టరీ సిపిఎం శాఖా కార్యదర్శిగా గంజి శ్రీనువాసులు ఎన్నిక



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 6)

పిటిపి ఫ్యాక్టరీ సిపిఎం శాఖాకార్యదర్శిగా గంజి శ్రీనువాసులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సిపిఎం ఉలవపాడు మండల కార్యదర్శిజీవీబీ కుమార్ తెలిపారు. ఆదివారం ఉలవపాడులో పిటిపి ఫ్యాక్టరీ శాఖా మహాసభ ఆ పార్టీ సీనియర్ నాయకులు చిమటా. శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ముందుగా సిపిఎం




అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి కి, బుద్ధదేవ్ కి , మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్ రాజు కి సంతాపం తెలిపి జోహార్లు అర్పించారు. మహాసభలోసిపిఎం మండల కార్యదర్శిజీవీబీ కుమార్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్చారని అన్నారు.ఫలితం గా కార్మికులు అనేక హక్కులను కోల్పోతున్నారని పేర్కొన్నారు. బోనస్ ను తగ్గించడం, ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులందరికీ పిఎఫ్ కట్టకపోవడం, ఫ్యాక్టరీలో రెస్ట్ రూము, భోజన వసతి వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం శోచనీయమన్నారు. వీటికోసం రాబోయే కాలంలో పోరాటాలు ఉద్యమాలు చేయాలని అన్నారు. ధరల పెరుగుతున్న, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను పెంపుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. కనీస వేతనాలు అమలు కోసం, మెరుగైన వేతన ఒప్పందం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పి మస్తాన్ బి, చిలుకా.శ్రీను వాసులు, చిమటా శ్రీనివాసులు పాల్గొన్నారు. సమావేశ అనంతరం నూతన శాఖ కార్యదర్శిగా గంజి శ్రీనువాసులు ను ఎన్నుకున్నారు.

## మా డిప్యూటీ సిఎం కటౌట్ తొలగించి మీ వైసీపీ ఫ్లెక్సీలు వేయాలంటే కుదరదు

### జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 6)

ఫ్లెక్సీల విషయంలో నారాయణ మాటకి మేం కూడా సమ్మతమే. మేమేం అతీతులం కాదు ఆయన చెప్పినట్లే వింటాం. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో మేము సహకరిస్తామన్నారు. ఫ్లెక్సీ రాజకీయం మాత్రమే తెలిసిన వైసీపీ నాయకులు ప్రజల తరిమికొట్టినా వారి పంథాన్ని మార్చుకోలేదన్నారు. జడ్పిటిసి అరుణమ్మ అనుచరులు ఇలా వితండం చేయడం సబబు కాదన్నారు. వివాదాస్పదంగా ఫ్లెక్సీలు కట్టడం, వితండ రాజకీయాలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం. మీరు ఇటువంటి చేష్టలు మానుకోవాలన్నారు. నోట్ల కట్టలతో కట్టిన ఫ్లెక్సీలు మా జనసైనికుల రక్తంతో కట్టిన కటౌట్‌లకి పోటీ పెట్టకండి అని అన్నారు. జనసైనికుల మనోభావాలు దెబ్బతింటే ఎట్లుంటాయో గత ఫలితాలను చూసి తెలుసుకోండన్నారు సింహపురి హాస్పిటల్ ఎదురుగా నగరం ఎంట్రన్స్ నందు ఏర్పరచిన పవన్ కళ్యాణ్ కటౌట్ తొలగించి తొలగించక ముందే వైఎస్ఆర్సిపి నాయకులు ఫ్లెక్సీలు కట్టడాన్ని వ్యతిరేకిస్తూ జనసేన నాయకులు అక్కడికి చేరుకొని వివాదాస్పదమైన ప్రదేశాల్లో ఫ్లెక్సీలు కట్టరాదని వాటిని తీయించారు. రూల్స్ గురించి మాకు తెలుసునని కటౌట్ తీసి తీయక ముందే వైసిపి ఫ్లెక్సీలు కట్టడం వివాదాస్పదంగా మారుతుంది అని తెలిపారు.

## ఉత్తమ వీడియోలు, రీల్స్ తయారు చేసి పంపేందుకు

# అక్టోబర్ 25 వరకు గడువు పెంపు

### 3 నిమిషాలు నిడివి గల వీడియో, 3 నిమిషాల నిడివి గల రీల్‌లు నాణ్యతతో కూడినవి పంపాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 6)

జిల్లాలో పర్యాటక రంగ ప్రమోషన్ కొరకు జిల్లాలోని ఔత్సాహికులు పాల్గొని ఉత్తమ వీడియోలు, రీల్స్ తయారు చేయాలని వాటికి బహుమతులు ఉంటాయని, వాటిని పంపాల్సిన తేదీని అక్టోబర్ 25 వరకు పొడిగించడం జరిగిందనీ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 27న జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని తిరపతి జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల సమాచారాన్ని పర్యాటకులకు తెలియజేసి పర్యాటకులను ఆకట్టుకుని పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఉత్తమమైన వీడియోలు, రీల్స్ పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పోటీలను రెండు విభాగాలుగా కేటగిరీ 1, కేటగిరి 2 గా విభజించడం జరిగిందని తెలిపారు. కేటగిరి 1 లో భాగంగా ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం (తిరుమల), శ్రీ గోవిందరాజస్వామి ఆలయం(తిరుపతి), శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం (తిరుచానూరు), శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం (అప్పలాయగుంట), శ్రీ పరశురామేశ్వర స్వామి ఆలయం (గుడిమల్లం), శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం (శ్రీ కాళహస్తి), శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం (నారాయణవనం), శ్రీ వేదనారాయణ స్వామి ఆలయం (నాగలాపురం), శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయం (సురుటుపల్లి), వాటి పై 3 నిమిషాలు నిడివి గల వీడియో, 3నిమిషాల నిడివి గల రీల్ సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. కేటగిరి 1 లో అత్యుత్తమ వీడియో లేదా రీల్స్ సమర్పించిన వారికి మొదటి బహుమతిగా రూ.1,00,000, రెండవ బహుమతిగా రూ.50,000, మూడవ బహుమతిగా రూ.25,000 అందివ్వడం జరుగుతుందని తెలిపారు. కేటగిరి 2 లో భాగంగా తిరుపతి జిల్లాలోని ప్రముఖ విశ్రాంత మరియు ఆకర్షిత పర్యాటక ప్రదేశాలైన ఎస్ వి జూలాజికల్ పార్క్ (తిరుపతి), కళ్యాణి డ్యాం, చంద్రగిరి కోట, తలకోన జలపాతం, తలకోన, మామండూరు ఎకో టూరిజం, కైలాసనాథ కోన జలపాతం, శ్రీ సిటీ (సత్యవేడు), తూపిలిపాలెం బీచ్ (వాకాడు), ఇరకం ఐలాండ్, పులికాట్ లేక్, నేలపట్టు పక్షుల అభయారణ్యం వాటి పై వాటిపై 3నిమిషాల నిడివి గల వీడియో, 3 నిమిషాల నిడివి గల రీల్ సమర్పించవలసి ఉంటుందని తెలిపారు.

కేటగిరి 2 లో అత్యుత్తమ వీడియో లేదా రీల్స్ సమర్పించిన వారికి మొదటి బహుమతిగా రూ.1,00,000, రెండవ బహుమతిగా రూ.50,000, మూడవ బహుమతిగా రూ.25,000 అందివ్వడం జరుగుతుందని తెలిపారు. పోటీలో పాల్గొను అభ్యర్థులు వారు తీసిన వీడియోలు, రీల్స్ 25.10.2024వ తేది లోపు మెయిల్ కు పంపగలరని తెలిపారు. ఇతర వివరాలకు తిరుపతి.ఎపి.జిఓవి.ఇన్ వెబ్సైట్‌ను, ప్రాంతీయ పర్యాటక కార్యాలయం తిరుపతి జిల్లా పర్యాటక అధికారి వారి నెంబర్ 6309942027 ను సంప్రదించాలన్నారు.

ఇతర నెంబర్లు 9848823086, 9705933311 ను సంప్రదించగలరని తెలిపారు.

# చివరి ఎకరాకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, అక్టోబర్ 6)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చివరి ఎకరాకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం సంతమాగులూరు, అద్దంకి నియోజకవర్గంలో 35 కి.మీ. మేర ప్రవహిస్తూ లక్షా 80 వేల ఎకరాలకు నీళ్లు అందించే అద్దంకి బ్రాంచ్ కెనాల్ 18/0 ను రైతులు, ఎన్ఎస్పీ అధికారులతో కలిసి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే నీరు వృధాగా పోకుండా కాలువలో పేరుకు పోయిన చిల్లచెట్లు, సిల్ట్ పూడికను తీయించాలని, అలాగే కాలువ అంతటా తిరిగి షట్టర్లకు రిపేర్లు చేయించాలని, షట్టర్లు లేని చోట కొత్తగా షట్టర్లు ఏర్పాటు చేయించాలని, కాలువ పరివాహక ప్రాంతంలో జింగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేయాలని ఎన్నెస్పీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్ ద్వారా ఎగువ పొలాలకు సైతం నీరు అందించాలని, పర్చూరుకు సైతం సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పై స్పందిస్తూ పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి వచ్చే ఏడాది కల్లా కొరిశపాడు రిజర్వాయర్‌ను నీళ్లతో నింపుతామని, ఆగిపోయిన భవనాసీ రిజర్వాయర్ పనులను రీఎస్టిమేట్ చేసి పునః ప్రారంభిస్తామని మంత్రి స్పష్టం చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్లు విరిగిపోతే గత ప్రభుత్వం రిపేర్ చేయించలేకపోయిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2 గేట్లు మరమ్మతులకు నిధులు కేటాయింపులు జరిపి యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేసి గుండ్లకమ్మ రిజర్వాయర్ ద్వారా 90 వేల ఎకరాలకు, ప్రజలకు త్రాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్పీ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





## యాదవ ఉద్యోగుల ఆధ్వర్యంలో బోనేని వెంకటేశ్వర్లకు సన్మానం



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 6)

పట్టణంలోని యాదవ్ ఉద్యోగుల అసోసియేషన్ భవనంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ మొర్రి. పిచ్చయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇటీవల సామాజిక సేవా రంగంలో గౌరవ డాక్టరేట్ పొందిన అమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లను దుశ్శాలువ, పూలమాలతో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మొర్రి. పిచ్చయ్యా మాట్లాడుతూ 2016లో అమ్మ ఫౌండేషన్ స్థాపించి జిల్లా వ్యాప్తంగా అనేక సామాజిక కార్యక్రమాలు చేసి మంచి సేవా సంస్థగా పేరుపొందిదన్నారు. వీరి సేవలను గుర్తించి ఆసియన్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేసిందన్నారు. రాష్ట్ర బీసీ నాయకులు వెంకటయ్య మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక కార్యక్రమాలు చేస్తుందన్నారు.గిద్దలూరు మండల అధ్యక్షులు రమణయ్య, ట్రెజరర్ పోలయ్య, కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య ,బాలయ్య, హరికృష్ణ, కృష్ణ, శేఖర్, పుల్లయ్య సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, పాండు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ముత్తుకూరులో ఎమ్మెల్యే సోమిరెడ్డి సుడిగాలి పర్యటన







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 6)

ముత్తుకూరులో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. చేపల మార్కెట్, జెడ్పీ హైస్కూలు, ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్,బస్టాండ్ సెంటర్‌లో మార్కెట్, పెద్ద చెరువుల పరిశీలన చేశార. స్మశానంలో చేపట్టిన అభివృద్ధి పనులను చూపించిన అనంతరం కాకాణి తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో తోడేరు రెడ్డి పాలన ఎలా సాగిందో చూడటానికి వచ్చామన్నారు. మా హయాంలో మంజురై నిర్మాణం పూర్తయిన చేపల మార్కెట్ ప్రారంభానికి నోచుకోలేదన్నారు. జెడ్పీ హైస్కూలు ప్రహరీ పడిపోయి భద్రత లేకుండా పోయింశీ వాచ్ మన్ లేక రక్షణ కరువైంది..భవన నిర్మాణాలన్నీ అసంపూర్తిగా ఉన్నాయి. ఐదేళ్లలో దారుణంగా తయారైన శ్మశానానికి మట్టి తోలి బాగు చేస్తుంటే అమ్ముకుంటున్నామని కాకాణి కూస్తున్నాడన్నారు. నిన్నటి వరకు వర్షం కురిస్తే శ్మశానంలో అడుగుపెట్టే పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు ఒక్కసారి వచ్చి చూడమనండి స్మశానం ఎలా బాగుపడిందో కనిపిస్తుందన్నారు. పేదలు తమ ఇళ్ల బేస్మెంట్లలోకి మట్టి తోలుకుంటామంటే ఏడుస్తాడు, రైతులు తమ పొలాలను చదును చేసుకుంటామంటే కడుపు మంటతో అల్లాడుతున్నాడన్నారు. ప్రజలు, రైతుల అవసరాల మేరకు అధికారుల పర్యవేక్షణలో మట్టి తోలుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అక్రమంగా ఒక్క ట్రక్కు మట్టి కూడా ఊరు దాటేందుకు లేదని పోలీస్, రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కాకాణి దోచుకోవడం, దాచుకోవడం తప్ప సర్వేపల్లి నియోజవర్గానికి చేసింది శూన్యమన్నారు. ముత్తుకూరు హైస్కూలును అభివృద్ధి చేయడంతో పాటు వాచ్‌మెన్ నియామకానికి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రయత్నం చేస్తానన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు ముత్తుకూరులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్







(షణ్ముఖ వెలుగు, అద్దంకి, అక్టోబర్ 6)

సంతమాగులూరు మండలం వెల్లలచెరువు గ్రామంలో చింతల తిరుపతయ్య అనారోగ్యం బారిన పడి మెదడుకు శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటుండగా ఆదివారం వారి నివాసానికి వెళ్లి తిరుపతయ్యను పరామర్శించి ఆరోగ్య విషయమై వాకబు చేశారు. పమిడి నాగేశ్వరరావు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అదే విధంగా రావి కోటేశ్వరరావు ఇటీవల మృతిచెందగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మక్కెనవారిపాలెం గ్రామంలో దండా సుబ్బారావు ఇటీవల మరణించగా వారి నివాసానికి వెళ్లి సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. పచ్చవ హనుమంతరావు ఇటీవల కాలం చేయగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి హనుమంతరావు మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. మక్కెన శ్రీనివాసరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

# పంచాయితీరాజ్ డిపీఓ విభాగంలో తిరుపతి జిల్లాలో 289 మంది బదిలీ

## జిల్లా పంచాయితీ రాజ్ అధికారిణి సుశీల దేవి

(షణ్ముఖ వెలుగు, తిరుపతి, అక్టోబర్ 6)

తిరుపతి జిల్లా నందు పంచాయతీరాజ్‌శాఖ జిల్లా పంచాయతీ అధికారి పరిధిలో 2024 సాధారణ బదిలీలలో భాగంగా మొత్తం 289 మంది పంచాయితీ సెక్రటరీలు బదిలీ అయ్యారుని జిల్లా పంచాయితీ అధికారిణి సుశీల దేవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో పంచాయతీ సెక్రెటరీ గ్రేడ్ వన్ టు ఫోర్ 172 మంది గాను తిరుపతి జిల్లా పరిధిలో 140 మంది, ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి తిరుపతి జిల్లాకు 16 మంది, తిరుపతి జిల్లా నుండి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 16 మంది బదిలీ కావడం జరిగిందని, జిల్లా పంచాయతీ అధికారిని సుశీల దేవి ఆదివారము ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-5 కింద 95 మంది బదిలీ కాగా అందులో 75 మంది తిరుపతి జిల్లా పరిధిలో, ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాకు పదిమంది, తిరుపతి జిల్లా నుండి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు పదిమంది బదిలీ కావడం జరిగిందని, పంచాయితీ సెక్రటరీ గ్రేడ్ - 6 (డిజిటల్ అసిస్టెంట్) మొత్తం 22 మందికి గాను తిరుపతి జిల్లా పరిధిలో 22 మంది బదిలీలు అయ్యారని తెలుపుతూ, వెరసి మొత్తం తిరుపతి జిల్లాలో 289 మంది పంచాయతీరాజ్ డిపిఓ విభాగం పరిధిలో జరిగాయని తెలిపారు.

# ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 6)

ఈరోజు ప్రకాశం జిల్లాకు బదిలీపై వచ్చిన మైనింగ్ డీడీ బి రాజశేఖర్, ఒంగోలు ఆర్‌డిఓగా బాధ్యతలు స్వీకరించిన కే లక్ష్మి ప్రసన్న, వారి సిబ్బంది ఆదివారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు పూల మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఫొటో నెం.

# ఏడుగురు జూదరులు అరెస్ట్

(షణ్ముఖ వెలుగు, టంగుటూరు, అక్టోబర్ 6)

టంగుటూరు మండల పరిధిలోని సురారెడ్డిపాలెం గ్రామ శివారులో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు. సూరారెడ్డిపాలెం డంపింగ్ యార్డ్ వద్ద పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.6,240 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు.

# టిడిపి సీనియర్ నేత మృతి సంతాపం తెలిపి నివాళులు అర్పించిన టీడీపీ నాయకులు



(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, అక్టోబర్ 6)

మండలంలోని సంతవేలూరు గ్రామ పంచాయతికి చెందిన టీడీపీ సీనియర్ నేత టీడీపీ మరియు ఎన్టీఆర్ వీరాభిమాని సైకిల్ రంగయ్య (రంగనాథం) హఠాన్మరణంతో అటు టీడీపీలో ఇటు సంతవేలూరుతో పాటు మండలంలో విషాదం నెలకొంది. ఆదివారం టీడీపీ క్లస్టర్ ఇన్చార్జి పన్నెం నిర్మల్ మాజీ టీడీపీ అధ్యక్షుడు జయచంద్రనాయుడు, శ్రీనునాయుడు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దశరథన్, తెలుగు యువత నాయకులు నూతలపాటి హరి, మరదవాడ సర్పంచ్ కుమార్ చౌదరి తదితరులు ఆయన అకాల మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు ఆయన భౌతికకాయానికి పూలమాల నివాళులు అర్పించారు,వారి కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు.

# నేడు కలెక్టరేట్‌లో మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార నిర్వహాణ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్

(షణ్ముఖ వెలుగు, తిరుపతి, అక్టోబర్ 6)

సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను ఉ.10 గంటల నుండి మ.1 గంట వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో పాటు డివిజన్, మండల, సచివాలయం స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సంబంధిత అధికారులందరూ విధిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.



# కోనలో ధైర్యలక్ష్మీగా ఆదిలక్ష్మీదేవి



(షణ్ముఖ వెలుగు, రాపూరు, అక్టోబర్ 6)

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి పట్టమహిషి శ్రీ ఆదిలక్ష్మీ తాయారుకి నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో బాగంగా నాలుగోవ రోజైన ఆదివారం ఆదిలక్ష్మీ అమ్మవారికి ధైర్యలక్ష్మీ అలంకారం నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం అమ్మవారి మూలమూర్తికి వస్త్రసమర్పణ, పుష్పాలంకరణ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు అమ్మవారికి పాలు, పెరుగు, తేనే. నెయ్యి, పంచదాలతో పాటు,పలు రకాలైన పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం (అభిషేకం), నిర్వహించారు. తదుపరి అమ్మ వారికి ధైర్యలక్ష్మీ అలంకారం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి మూలమూర్తికి పూలాంగి సేవ నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. తదుపరి అమ్మవారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షణలో, ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచలయ్య స్వాముల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు ఆలయ అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గోని అమ్మవారినిదర్శించుకోని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

# చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో ఘనంగా శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు



**శ్రీ లలితా మహా త్రిపుర సుందరీ దేవి ఆలంకరణతో భక్తులకు దర్శన భాగ్యం కలిగించిన అమ్మవారు**

**108 పట్టు చీరల అలంకారంతో భక్తులను అనుగ్రహించిన వాసవి అమ్మవారు**

(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, అక్టోబర్ 6)

చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా నాలుగవ రోజు ఆదివారం పార్వతీ దేవి అమ్మవారు శ్రీ లలితా మహా త్రిపుర సుందరి దేవి అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. మాజీమంత్రి శిద్దా రాఘవ రావు సతీమణి శిద్దా లక్ష్మి పద్మావతి ఆద్వర్యంలో ఆదివారం ఉదయం శ్రీ వాసవి అమ్మవారికి పాంచామృత సుగంధ ద్రవ్యాల అభిషేకాలు నిర్వహించి తదుపరి అమ్మవారికి శ్రీ చక్రార్చన సాయంత్రం ఉభయదాతల చే కుంకుమ అర్చన,అర్యవైశ్య మహిళలచే సామూహిక శ్రీ లలితా సహస్ర నామ సోస్త్రం,పారాయణం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శ్రీ పార్వతీ దేవి అమ్మవారికి శ్రీ నగరేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేక పూజా శ్రీ చక్రార్చన నవావరణ పూజా, నైవేద్యం, హారతి, తీర్థ ప్రసాదాల వినియోగం జరిగింది. శ్రీ దేవీ శరన్నవరాత్రి వేడుకలు సందర్భంగా శ్రీ హరిహర క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమశ్వరి అమ్మవారికి శిద్దా లక్ష్మి పద్మావతి ఆద్వర్యంలో 108 పట్టు చీరల అలంకారం భక్తి పారవశ్యం పెల్లుబికింది. మహిళా భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి పట్టు చీరలు సమర్పించి స్వయంగా అలంకరించడం విశేషంగా నిర్వహించారు. వినూత్నంగా జరిగిన అమ్మవారి పట్టు చీరల అలంకారం చూడటానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.సోమవారం శ్రీ కంచి కామాక్షి దేవి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శన భాగ్యం కలిగిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. శిద్దా వెంకటేశ్వర్లు, శ్రీమతి వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అల్పాహారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు దంపతులు,శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా సాయి బాబా దంపతులు, చలువాది బదరీ నారాయణ, కొణిజేటి సువర్ణ, గాదంశెట్టి లక్ష్మి, చలువాది మాధవి, కూరపాటి ధనలక్ష్మి, దాట్ల సువర్చల, ఏ అరుణ, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# ఒంగోలు టూ టౌన్ పోలీసులు కొట్టి అవమానించినందు వల్లే రాజశేఖర్ బలవన్మరణం

**అధికార పార్టీ నేతల మెప్పుకోసం మృతుడి పై థర్డ్ డిగ్రీ**

**రాజశేఖర్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి**

**వీఆర్ కాదు పోలీసులను సస్పెండ్ చేయాలి**

**జిల్లా కలెక్టర్ మెజిస్ట్రీరియల్ ఎంక్వైరీ జరిపించాలి**

**దళిత నేత నీలం నాగేంద్ర డిమాండ్**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 6)





ఒంగోలు టూ టౌన్ పోలీసులు కొట్టి అవమానించడంతో పురుగుమందు తాగి మరణించిన పరుచూరి రాజశేఖర్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఆదివారం రిమ్స్ పోస్టుమార్టం రూమ్లో పరుచూరి రాజశేఖర్ మృతదేహాన్ని నాగేంద్ర పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం పోలీసులు చూపిన అత్యుత్సాహమే రాజశేఖర్ బలవన్మరణానికి కారణమైందన్నారు. రెండు సంవత్సరాల క్రితం కొత్తపట్నం పోలీస్ స్టేషన్లో వింటాస్ హేచరీస్ ఏండి ఎస్వి సుధాకర్ కు - మేనేజర్ పరుచూరి రాజశేఖర్ కు మధ్య ఆర్థిక లావాదేవీల వివాదంపై పరిష్కారం జరిగిందన్నారు. అధికారం మారడంతో అధికార పార్టీ ముఖ్య నేత సూచన మేరకు పరుచూరి రాజశేఖర్ ను ఒంగోలు టూ టౌన్ పోలీసులు సెప్టెంబర్ 30న స్టేషన్కు పిలిపించారన్నారు. వింటాస్ హేచరీస్లో జరిగిన ఆర్థిక అవతావకలపై నేరం అంగీకరించాలని రాజశేఖర్ ను అవమానకరంగా కొట్టారన్నారు. బలవంతంగా కాగితాలపై సంతకం చేయించుకున్నారన్నారు. అవమానభారంతో పురుగు మందు తాగిన రాజశేఖర్ జరిగిన ఘటనపై సూసైడ్ నోట్ కూడా రాశారని, ఆ నోట్‌లో తనను కొట్టిన పోలీసుల పేర్లు, ఏం జరిగిందనే వివరాలను పేర్కొన్నాడన్నారు. కొందరు పోలీసులు పోలీస్ మాన్యువల్‌ను, నేర విచారణ ప్రక్రియను పక్కనపెట్టి అధికార పార్టీ నేతల ఆజ్ఞల్నే తమ ఆఫీస్ మాన్యువల్‌గా మార్చుకున్నారన్నారు. ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్లో దళితుడైన దామరకుంట కుమార్ ఆత్మహత్యాయత్నం ఘటనతో పాటు ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పరుచూరి రాజశేఖర్ బలవన్మరణానికి పోలీసులపై అధికార పార్టీ నేతల ప్రభావమే కారణమన్నారు. ఒంగోలు తాలూకా పోలీసుల అదృష్టం బాగుండి, ఆత్మహత్యకు పాల్పడ్డ దళితుడు దామరగుంట కుమార్ బతికాడన్నారు. ఒంగోలు టూ టౌన్ పోలీసుల ఖాకీ క్రౌర్యానికి కమ్మ కులానికి చెందిన పరుచూరి రాజశేఖర్ మరణించాడన్నారు. రాజశేఖర్‌ను స్టేషన్‌లో కొట్టి అవమానించిన పోలీసుల్ని విఆర్‌కు పంపితే సరిపోదని, వారి పై శాఖా పరమైన చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని నాగేంద్ర డిమాండ్ చేశారు. పరుచూరి రాజశేఖర్ బలవన్మరణాన్ని కస్టోడియల్ డెత్ గా పరిగణించి జిల్లా కలెక్టర్ ఒంగోలు ఆర్డీఓ ద్వారా మెజిస్టీరియల్ ఎంక్వైరీ జరిపించాలని నాగేంద్ర డిమాండ్ చేశారు. నాగేంద్ర వెంట బహుజన గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

# బంగారు పథకాలు సాధించిన పూజిత, రోహిత్‌లకు అభినందనలు

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 6)

9వ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ స్టేట్ లెవల్ ఆటియా పాటియా ఛాంపియన్షిప్ 2024 అంతర్జాతీయ క్రీడల్లో రాష్ట్ర నుండి బంగారు పథకాలు సాధించిన పూజిత, రోహిత్‌లకు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ అభినందనలు తెలిపారు. సమిష్టి కృషి, ఒత్తిడిని ఎదుర్కోవడం, జవాబుదారీతనం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ పటిమ, నలుగురిలో నడవడిక వంటివి క్రీడల వలన అలవడుతాయి కీప్ ట్రయింగ్ వదలొద్దు. అతిథులు చెప్పినట్లు చరిత్రలో మనకో పేరుండాలి వీరిని వెన్నంటి ప్రోత్సహిస్తున్న పిటి టీచర్లకు తనను ఆహ్వానించిన చక్రీ, అజయ్‌కి ప్రత్యేక అభినందనలు తెలిపారు. యూత్ అంటే పవన్ కళ్యాణ్‌కి ఎంతో ఇష్టం. మీ కోసం ఏదైనా చేయమని జనసేన పెద్దలకు చెప్తా.పూజిత, రోహిత్ మేం పేదవాళ్లం. రూపాయి పోగుచేసుకుని దాతల ఆర్థిక ప్రోత్సాహంతో అంతర్జాతీయ మెడల్స్ సాధించామన్నారు. ప్రభుత్వం సహకారం ఉంటే మాలాంటి మరెందరం రాష్ట్రం నుండి మెడల్ సాధించే అవకాశం ఉంది.

### ఆటియా పాటియా రాష్ట్రస్థాయి క్రీడాకారులు



ఒక్క రూపాయి కూడా కూడా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర క్రీడలకు కేటాయించకపోవడం చాలా బాధగా ఉంది. ఒక్క ప్రభుత్వ ఉద్యోగం కూడా రాష్ట్రస్థాయి రిజర్వేషన్ క్రీడాకారులకు లేదు ఏది సాధించినా సెంట్రల్ జోన్లోనే రాష్ట్రస్థాయిలో క్రీడాకారులకు రిజర్వేషన్ లేదు. బివిఎస్ మున్సిపల్ కార్పొరేషన్ గర్ల్స్ హై స్కూల్, నవాబుపేట నెల్లూరు సిటీ నందు 9వ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ స్టేట్ లెవెల్ ఆటియా పాటియా ఛాంపియన్షిప్ 2024 గేమ్స్ నిర్వహించారు. ఈ రాష్ట్ర స్థాయి క్రీడకు ప్రత్యేకంగా ఆహ్వానించిన జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ టాస్ వేసి క్రీడలను ప్రారంభించారు. పీఈటి టీచర్స్ చక్రి, అజయ్ ఆధ్వర్యంలో బివిఎస్ గర్ల్స్ హై స్కూల్ హెడ్ మిసెస్ విజయ జ్యోతి అతిథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంకా ఆర్ డి ప్రసాద్, (సీఈవో ఏపీఏఏపీ) కేఎస్ జబీర్, (ప్రెసిడెంట్ ఏపిఏఏపీ) శ్రీ చరణ్ (సెక్రెటరీ ఏపిఏఏపీ), నారా లోకేష్ ఫౌండేషన్ చంద్ర పాల్గొన్నారు.



# కనురెప్పలు పల్చగా ఉన్నాయా.. ఈ ఆయిల్స్ రాయండి



కనుబొమ్మలు, కనురెప్పలు ఒత్తుగా ఉంటేనే కళ్ళు చూడ్డానికి అందంగా కనిపిస్తాయి. కొంతమందికి కనుబొమ్మలు, కనురెప్పలు చాలా పల్చగా ఉంటాయి. అలాంటి వారు ఖరీదైన ట్రీట్‌మెంట్స్ బదులు కొన్ని నేచురల్ టిప్స్ ఫాలో అవ్వొచ్చు. దీని వల్ల ఇంట్లోనే నేచురల్‌గా ఒత్తైన కనురెప్పల్ని పెంచుకోవచ్చు. ఆ టిప్స్ ఏంటో తెలుసుకోండి.

**పెట్రోలియం జెల్లీ..** పెట్రోలియం జెల్లీ అందరి ఇళ్ళలో ఉంటుంది. దీనిని రాయడం వల్ల కూడా లాషెస్ ఒత్తుగా, త్వరగా పెరుగుతాయి. కాబట్టి, వీటిని రెగ్యులర్‌గా రాయడం చాలా మంచిది.

**కనుబొమ్మల కోసం సీరమ్..??**

**గ్రీన్ టీ..**





అదే విధంగా, గ్రీన్ టీ కూడా జుట్టుని పెంచడంలో హెల్ప్ చేస్తుంది. గ్రీన్ టీలో ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. దీనిని లాషెస్‌పై రాయడం వల్ల లాషెస్ స్టిమ్యులేట్ అయి ఎక్కువగా పెరుగుతాయి.

**ఆలివ్ ఆయిల్..** ఆలివ్ ఆయిల్‌లో కూడా అద్భుత గుణాలు ఉంటాయి. వర్జిన్ ఆయిల్‌లో కొద్దిగా కాటన్ డిప్ చేసి లాషెస్‌పై అప్లై చేయాలి. దీని వల్ల హెయిర్ ఫోలికల్స్ బలంగా మారతాయి. ఈ ఆయిల్ రాలడం వల్ల లాషెస్ బలంగా మారతాయి.





**కొబ్బరినూనె..** కొబ్బరినూనెలో ఎక్కువగా లారిక్ యాసిడ్ ఉంటుంది. ఇవి లాషెస్‌ని మృదువుగా చేస్తాయి. దీనిని రాయడం వల్ల లాషెస్ బలంగా మారతాయి. బ్రేకేజ్ అవ్వకుండా ఉంటాయి. కాబట్టి, దీనిని రెగ్యులర్‌గా రాయడం వల్ల మాయిశ్చరైజ్ అవుతాయి.

**క్యాస్టర్ ఆయిల్..** అదే విధంగా, ఆయిల్స్ రాయడం వల్ల లాషెస్ బలంగా మారతాయి. ఆముదంలో అద్భుత గుణాలు ఉంటాయి. ఇవి లాషెస్‌ని బలంగా చేస్తాయి. అందుకే చాలా లాషెస్ సీరమ్స్‌లో ఆముదం కచ్చితంగా ఉంటుంది. దీనిని రాయడం వల్ల లాషెస్ ఒత్తుగా పెరుగుతాయి.

**దువ్వడం..** అదే విధంగా, ఐ లాషెస్‌ని దువ్వడం కూడా చాలా మంచిది. దీనికంటూ ఓ బ్రష్ ఉంటుంది. దీంతో బ్రష్ దువ్వడం వల్ల డర్ట్ దూరమవుతాయి. ఫాలికల్స్ కూడా అన్‌క్లాగ్ అయి లాషెస్‌ని స్ట్రాంగ్ చేస్తుంది.

**ఐలాషెస్ సీరమ్..** ఐలాషెస్‌ని పెంచుకునేందుకు కొన్ని సీరమ్స్‌ని వాడొచ్చు. వీటిని మీరు డాక్టర్‌ని అప్రోచ్ అయి వారి సలహాతో మంచి నేచురల్ సీరమ్‌ని అప్లై చేయొచ్చు. దీని వల్ల లాషెస్ స్ట్రెంథ్ అవుతాయి. స్మూత్‌గా మారతాయి. దీనిని రాయడం వల్ల లాషెస్ డ్యామేజ్ అవ్వవు.

**విటమిన్ ఈ..** విటమిన్ ఈ ఆయిల్ మనకి క్యాప్సూల్ రూపంలో దొరుకుతాయి. విటమిన్ ఈ జుట్టు ఆరోగ్యానికి హెల్ప్ చేస్తుంది. ఇందులోని ఆయిల్‌ని లాషెస్‌పై రాసి 5 నుంచి 10 నిమిషాల పాటు మసాజ్ చేస్తే లాషెస్ బలంగా మారతాయి.

# గుడ్డులో వీటిని కలిపి మాస్క్ వేస్తే జుట్టు పొడుగ్గా పెరుగుతుంది





నేటి కాలంలో చాలా మంది హెయిర్ ప్రాబ్లమ్స్‌తో బాధపడుతున్నారు. ఈ సమస్యని తగ్గించుకోవాలంటే కొన్ని పోషకాలు జుట్టుకి అందాలి. అందుకోసం ఎగ్ మాస్క్ హెల్ప్ చేస్తుంది. గుడ్లల ప్రోటీన్, బయోటిన్, ఫోలేట్, విటమిన్స్ ఎ, డి, ఈ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి జుట్టు పెరిగేలా చేస్తాయి. జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి. అందుకోసం గుడ్డుతో ఎలాంటి మాస్క్‌లు వేయొచ్చో తెలుసుకోండి.

**మయోనైస్‌తో..**

ఓ బౌల్‌లో గుడ్డుని వేయండి. అందులోని కొద్దిగా మయోనైస్ వేసి బాగా కలపండి. దీనిని కుదుళ్ళు, జుట్టుకి అప్లై చేయండి. దీని వల్ల జుట్టు మృదువుగా, మెరిసేలా చేస్తుంది.

**జుట్టు రాలడాన్ని తగ్గించే హెయిర్ మాస్క్..??**

**గుడ్డు పచ్చసొన, ఆలివ్ ఆయిల్..**

**కావాల్సిన పదార్థాలు..**

**ఓ గుడ్డు పచ్చసొన**

**ఆలివ్ ఆయిల్**

గుడ్డు పచ్చసొనలో ప్రోటీన్, ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్స్ ఎ, డి, ఈలు పుష్కలంగా ఉంటాయి. అయితే, ఆలివ్ ఆయిల్ జుట్టుని సాఫ్ట్‌గా చేయడమే కాకుండా బలంగా చేస్తుంది. స్కాల్ప్‌ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది.

**తయారీ విధానం..**

ముందుగా అన్ని పదార్థాలన్నింటిని ఓ బౌల్‌లో వేసి బాగా కలపండి. దీనిని తలకి, జుట్టుకి అప్లై చేయండి. గంట తర్వాత కడగండి. వారానికి రెండు, మూడు సార్లు చేయండి.





అరటిపండు, తేనెతో..

**కావాల్సిన పదార్థాలు..**

**ఓ గుడ్డు**

**అరటిపండు గుజ్జు**

**3 టేబుల్ స్పూన్ల పాలు**

**3 టేబుల్ స్పూన్ల తేనె**

**ఐదు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్.**




**నిమ్మరసంతో..**

**కావాల్సిన పదార్థాలు..**

గుడ్డు, నిమ్మరసం.. ఓ బౌల్‌లో గుడ్డు కొట్టిపోయండి.. అందులోనే నిమ్మరసం వేసి బాగా బీట్ చేయండి. దీనిని తలకి అప్లై చేసి ఆరిన తర్వాత క్లీన్ చేయండి.ఇలా గుడ్డుతో హెయిర్ మాస్క్ వేయడం వల్ల జుట్టు సమస్యలు తగ్గుతాయి జుట్టు కూడా అందంగా మారతుంది.

# ఈ కూరగాయల్లో బోలెడు మ్యాటర్..

ప్రస్తుత కాలంలో డయాబెటిస్ అనేది అతి పెద్ద ముప్పుగా మారింది. డయాబెటిస్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా చాలామంది ఈ మహమ్మారితో బాధపడుతున్నారు. డయాబెటిస్ వచ్చిన వారి రక్తంలో షుగర్ లెవల్స్ హెచ్చు తగ్గులకు గురవుతాయి. దీంతో శరీర కణాలకు శక్తి అందక అలసటగా అనిపిస్తుంది. డయాబెటిస్ ఒక దీర్ఘకాలిక వ్యాధి. ఒక్కసారి వచ్చిందంటే, జీవితాంతం చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకునే ప్రయత్నాలు చేయాలి. అయితే జీవన శైలి మార్పులు, చిన్నపాటి ఆహారపు అలవాట్లు పాటిస్తే వ్యాధి సోకే ముప్పు తగ్గుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా డయాబెటిస్ రోగులకు డైట్ అనేది చాలా కీలకం. తీసుకునే ఆహారాన్ని బట్టి షుగర్ లెవల్స్ ఉంటాయి. తినకూడనవి తింటే రక్తంలో షుగర్ లెవల్స్ పెరుగుతాయి. మధుమేహ వ్యాధికి ప్రధాన కారణం ఏంటో ఇప్పటి వరకు ఖచ్చితంగా తెలియదని డాక్టర్లు తెలిపారు.



అయితే.. అనేక అధ్యయనాలు, నివేదికలు కొన్ని కూరగాయలు తీసుకోవడం వల్ల డయాబెటిస్ రోగులకు చాలా లాభాలు చేకురూస్తాయని వెల్లడించాయి. తినే ఆహారంలో ఈ కూరగాయలు తీసుకోవడం వల్ల షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయని నివేదికలు తెలిపాయి. ఈ కూరగాయల్లోని పోషకాలు షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేస్తాయి. ఈ కూరగాయలు తక్కువ ధరకే లభిస్తాయి. ఇంతకీ ఆ కూరగాయలు ఏంటి..? వాటిని ఎలా తీసుకోవాలో ఇక్కడ తెలుసుకుందాం.

**షుగర్‌ని కంట్రోల్ చేసే కూరగాయలు..టమాటా..** ఇంట్లో ఏ కూర చేసిన టమాటా ఉండాల్సిందే. టమాట లేకపోతే ఆ కూర వంటడం కుదరదన్న భావనలో చాలా మంది ఉంటారు. అలాంటి టమాట.. షుగర్ పేషంట్లకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. టమాటాల్లో లైకోపిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఈ యాంటీ ఆక్సిడెంట్ రక్తంలోని షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. టమాటాల్లోని విటమిన్ సి వల్ల ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. దీంతో.. డయాబెటిస్‌తో పోరాడే శక్తి మీకు వస్తుంది. టమాటను మీరు సలాడ్స్, కూరలు, జ్యూసుల రూపంలో తీసుకోవచ్చు.

**సెలెరీ ఆకులు..** సెలరీ అనేది అపియాసి కుటుంబానికి చెందిన ఆకుకూర. ఇది అచ్చం కొత్తిమీరలా కనిపిస్తుంది. కానీ, కొత్తిమీర మాత్రం కాదు. సెలరీని పోషకాల గని అంటారు. ఇందులో అనేక రకాల పోషకాలు ఉంటాయ. విటమిన్ కె, సి, పొటాషియం, ఫోలెట్ వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. సెలెరీ ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి రక్తంలోని షుగర్ లెవల్స్‌ని నియంత్రణలో ఉంచుతాయి. సెలెరీలో థైమాల్ అనే మూలకం ఉంది. ఇది ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడం కీలక పాత్ర పోషిస్తుంది. దీంతో.. డయాబెటిస్ పేషంట్లు దీనిని తీసుకోవడం ఉత్తమం. సెలరీ ఆకుల్ని జ్యూస్‌గా చేసుకుని తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి.

**గోరు చిక్కుళ్లు..** మనలో చాలా మంది గోరు చిక్కుళ్లని చాలా ఇష్టంగా తింటారు. గోరు చిక్కుడులో ప్రొటీన్లు చాలా అధికంగా ఉంటాయి. స్వల్పంగా పిండి పదార్థాలు, పీచు పదార్థాలు ఉంటాయి. అంతేకాకుండా అనేక ఖనిజ లవణాల్ని గోరు చిక్కుడు కలిగి ఉంది. దీంతో డయాబెటిస్‌తో బాధపడేవారికి గోరు చిక్కుళ్లు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. రక్తంలోని చక్కెర స్థాయిని ఇది అదుపులో ఉంచుతుంది. అంతేకాకుండా గోరు చిక్కుడులో గ్లైకోన్యూట్రియెంట్లు ఉన్నాయి. ఇవి శరీరంలో షుగర్ లెవల్స్‌ని కంట్రోల్‌లో ఉంచుతాయి. అంతేకాకుండా దీనిలో గ్లైసెమిక్ ఇండెక్స్ కూడా చాలా తక్కువగా ఉంటుంది. దీంతో.. డయాబెటిస్ పేషంట్లకు గోరు చిక్కుళ్లు సూపర్ ఫుడ్ అని చెప్పొచ్చు.

**ఈ కూరగాయలు కూడా..** వీటితో పాటు మరికొన్ని కూరగాయల్ని మీ ఆహారంలో చేర్చుకుంటే డయాబెటిస్ ముప్పు తగ్గుతుంది. తోట కూర, బచ్చలి కూర, పాల కూర వంటి ఆకుకూరలు ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతాయి. దీంతో.. మధుమేహ రోగులు వీటని తినే ఆహారంలో తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆకుకూరలతో పాటు ఆస్పగగస్ (శతావరి), బెండకాయ, మష్రూమ్స్ వంటివి తీసుకున్న ఉత్తమ ఫలితాలు ఉంటాయి. బెండకాయల్లో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. బెండకాయలో ఉండే ఫైబర్.. రక్తంలోని షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేస్తాయని అధ్యయనాలు వెల్లడించాయి.

**వీటిని కూడా పాటించాల్సిందే..** మనిషికి నిద్ర ఎంతో కీలకం. ఉదయాన్నే నిద్రలేచి.. రాత్రి త్వరగా నిద్రపోవడం వల్ల డయాబెటిస్ కంట్రోల్‌లో ఉంటుంది. రోజూ కనీసం 7 గంటలు నిద్ర పోతే వ్యాధి రిస్క్ తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. మధ్యాహ్నం సమయంలో నిద్రించడం వల్ల కఫా దోషం పెరుగుతుందని, సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం నిద్రపోకూడదని నిపుణులు చెబుతున్నారు. మంచి నిద్రతో పాటు.. ప్రతి రోజూ ఆహారం తిన్న తర్వాత కొద్ది సేపు నడిస్తే మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నాయి. ఇలా చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. రోజుకు రెండుసార్లు తలస్నానం చేస్తే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు శరీర దుర్వాసన తగ్గుతుంది. ఆ తర్వాత వ్యాధుల ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. అంతేకాకుండా వేడి నీటితో స్నానం చేస్తే రక్త ప్రసరణ మెరుగుపడి.. షుగర్ లెవల్స్ తగ్గుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# ఈ జ్యూస్‌లు తాగితే బాడీలో బ్లడ్ లెవల్స్ అమాంతం పెరుగుతాయి

బాడీలో ఐరన్ తక్కువగా ఉంటే శక్తి తగ్గడం, అలసట, ఏకాగ్రత తగ్గడం, చర్మ పాలిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అయితే, మనం ఐరన్ ఫుడ్స్, డ్రింక్స్ తీసుకోవడం వల్ల ఈ సమస్య తగ్గుతుంది. ఐరన్ సహజంగానే కొన్ని ఫుడ్స్‌లో ఉంటుంది. వీటిని మీ డైట్‌లో ఎలా చేర్చుకునేందుకు కొన్ని డ్రింక్స్ తీసుకోవచ్చు.

**ఐరన్ లోపానికి కారణాలు..** ఐరన్ లోపం రావడానికి చాలా కారణాలు. ఆడవారిలో ఎక్కువగా హెవీ మెనుస్ట్రువల్ పీరియడ్స్ కడుపు, ప్రేగులలో రక్తస్రావం జరగడం .**ఐరన్‌ని గ్రహించకపోవడం, కిడ్నీ సమస్యలు, దీర్ఘకాలిక మంటకి కారణమయ్యే ఆరోగ్య సమస్యలు**

**రక్తాన్ని పెంచే డ్రింక్స్..??**

**దానిమ్మ..**

దానిమ్మలో కూడా ఐరన్‌తో పాటు విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. దీంతో పాటు ఖర్జూరాల్లో ఐరన్ లెవల్స్ పుష్కలంగా ఉంటాయి ఈ రెండింటిని కలిపి తీసుకోవడం చాలా మంచిది. ఐరన్, విటమిన్ సి కలిపి తీసుకుంటే బాడీలో విటమిన్ సి అనేది ఐరన్‌ని అబ్జార్వ్ చేసేందుకు హెల్ప్ చేస్తుంది.

**స్పినాచ్ స్మూతీ..** స్మూతీలలో ఎన్నో పోషకాలు ఉంటాయి. బచ్చలికూరలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. దీనిని పైనాపిల్‌తో కలిపి తీసుకోవచ్చు. పైనాపిల్‌ని యాడ్ చేయడం వల్ల విటమిన్ సి కంటెంట్‌తో పాటు రుచి కూడా పెరుగుతుది. అవసరమైతే ఇందులో నిమ్మ, నారింజలు కూడా యాడ్ చేయొచ్చు.

**ప్రూనే జ్యూస్..** డ్రై చేసిన ప్లమ్ ఫ్రూట్స్‌నే ప్రూనే అంటారు. వీటితో జ్యూస్ చేసుకుని తాగడం వల్ల ఐరన్ సహా ముఖ్య పోషకాలు అందుతాయి. దీనిని తాగడం వల్ల ఐరన్ లోపం తగ్గుతుంది. ఈ జ్యూస్‌లో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, రక్తపోటు కూడా తగ్గుతుంది.

**గ్రీన్ జ్యూస్..** గ్రీన్ జ్యూస్ తాగడం వల్ల ఐరన్ లెవల్స్ పెరగడమే కాదు. స్కిన్ మెరుస్తుంది. బరువు కూడా తగ్గుతారు. దీనికోసం మీరు నిమ్మరసం, పార్స్లీ, పియర్, బచ్చలికూర, సెలెరీ వంటి వాటితో జ్యూస్ చేసుకోవచ్చు. ఇందులో విటమిన్ సి ఎక్కువగా ఉండే పండ్లని యాడ్ చేసుకోవచ్చు. దీని వల్ల ఐరన్ లభిస్తుంది.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com